Circulated in: Hyderabad, Siddipet, Sircilla, Khammam, Karimnagar, Nizamabad, Jangaon, Warangal, Mahaboobnagar, Kurnool, Vijayawada, Rajahmundry, Vizag

# కాంగ్రెస్‌కు అనుకూలం!

- మెజారిటీ ప్రీ, ఎగ్జిట్ పోల్ సర్వే సంస్థల అంచనా
- హస్తానికి మ్యాజిక్ మార్కు ఇచ్చిన అత్యధిక సర్వేలు
- ఒకట్రెండు సర్వే సంస్థలు మాత్రం హంగ్‌కు మొగ్గు
- బీఆర్ఎస్‌కు మ్యాజిక్ మార్కు ఇచ్చిన 2 సంస్థలు
- కారుకు అత్యల్పం 22.. హస్తానికి అత్యధికం 82
- బీజేపీకి సింగిల్ డిజిట్‌నే ఇచ్చిన మెజారిటీ సర్వేలు








- పోరు ముగిసింది..! అంచనాలకు తెర లేచింది!!.. పోలింగ్ పూర్తయింది..!
- ఫలితాలపై ఉత్కంఠ మొదలైంది!!.. ఓటరు తన నిర్ణయం చెప్పేశాడు!
- ఆ నిర్ణయం ఏమిటనే సస్పెన్స్ నెలకొంది!!

**యదార్థవాది, న్యూఢిల్లీ, 30 నవంబరు :** తెలంగాణలో పదేళ్ల కేసీఆర్ పాలనకు ప్రజలు చరమ గీతం పాడబోతున్నారా!? తెలంగాణ ఇచ్చిన కాంగ్రెసను ఈసారి ఆదరించనున్నారా!? తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి రానుందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి గురువారం సాయంత్రం వెలువడిన ప్రీ పోల్, ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి రానుందని అత్యధిక ఫలితాలు స్పష్టం చేయగా.. కాంగ్రెస్ అధిక సీట్లు గెలుచుకున్నప్పటికీ హంగ్ పరిస్థితి నెలకొనే అవకాశం ఉందని ఒకటి రెండు సర్వే సంస్థలు అంచనా వేశాయి. థర్డ్ విజన్, పొలిటికల్ గ్రాఫ్ సర్వే సంస్థలు మాత్రమే బీఆర్ఎస్ మ్యాజిక్ మార్కును దాటుతుందని తెలిపాయి. ఆ పార్టీకి అత్యల్పంగా 22 స్థానాలు వచ్చే అవకాశం ఉందని చాణక్య స్ట్రాటజీస్ అంచనా వేసింది. ఇక, సౌత్ ఫస్ట్, ఇండియా టీవీ, న్యూస్-24, టైమ్స్ నౌ, చాణక్య స్ట్రాటజీస్, పీపుల్స్ పల్స్, స్మార్ట్ పోల్ సర్వే సంస్థలు కాంగ్రెస్ పార్టీకి మేజిక్ మార్కును దాటే సీట్లు వస్తాయని వివరించాయి.

ఆ పార్టీకి అత్యధికంగా 82 రావచ్చని స్మార్ట్ పోల్ అంచనా వేస్తే.. అత్యల్పంగా 34 రావచ్చని థర్డ్ విజన్ అభిప్రాయపడింది. రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ కూడా కాంగ్రెసకు 63 నుంచి 69 సీట్లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఒకటి రెండు మినహా మెజారిటీ సర్వే సంస్థలు బీజేపీకి సింగిల్ డిజిట్‌నే కట్టబెట్టాయి. ఆ పార్టీకి అత్యధికంగా 13 సీట్లు వచ్చే అవకాశం ఉందని ఏబీపీ న్యూస్, జన్ కీ బాత్ అంచనా వేస్తే.. అత్యల్పంగా ఒక సీటు వచ్చే అవకాశం ఉందని రేస్ సర్వే సంస్థ తెలిపింది. తెలంగాణలో హంగ్ పరిస్థితిని తోసిపుచ్చలేమని ఏబీపీ న్యూస్, జన్ కీ బాత్, రిపబ్లిక్ టీవీ, టీవీ9 భారత్ వర్ష్, ఆరా (ప్రీ పోల్), ఆత్మసాక్షి, రేస్, సీఎన్ఎన్ సర్వే సంస్థలు అంచనా వేశాయి. గతంలో ఏడు స్థానాల్లో విజయం సాధించిన మజ్లిస్.. ఈసారి నాంపల్లి స్థానాన్ని కోల్పోయి మిగిలిన ఆరు సీట్లలో విజయం సాధిస్తుందని తెలిపాయి. కాగా.. గత

మిగతా 4లో

# పోటెత్తిన ఓటరు

- అర్ధరాత్రి 12 గంటలకు 70% దాటిన పోలింగ్.. 75 శాతానికి చేరుకునే అవకాశం
- మందకొడిగా మొదలై పుంజుకున్న వేగం.. చివరి గంటలో ఒక్కసారిగా పెరిగిన జోరు
- మునుగోడులో అత్యధికంగా 91.5% పోలింగ్
- యాకుత్‌పురాలో అత్యల్పంగా 39.69 శాతం
- అతితక్కువగా హైదరాబాద్ జిల్లాలో 46.6 శాతం
- పలు కేంద్రాల్లో మొరాయించిన ఈవీఎంలు
- పట్టణ ఓటర్లలో నిర్లిప్తత.. పల్లెల్లో హుషారు
- కొన్ని ప్రాంతాల్లో నేతల మధ్య తోపులాటలు
- చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతం
- సిర్పూర్‌లో రీపోలింగ్‌కు కాంగ్రెస్, బీజేపీ డిమాండ్



**యదార్థవాది, హైదరాబాద్, 30 నవంబరు :** రాష్ట్రంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లు పోటెత్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొనగా.. పట్టణ ప్రాంతాల్లో మాత్రం కొంత మందకొడిగానే పోలింగ్ సాగింది. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించడం, అక్కడక్కడా చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్‌కు పెద్దగా అవాంతరాలేమీ ఎదురుకాలేదు. కడపటి సమాచారం అందేటప్పటికి.. అంటే, గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయానికి 70.66 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు. అది 75 శాతానికి చేరుకునే అవకాశాలున్నాయని అంచనా. 2018 ఎన్నికల్లో రాష్ట్రంలో 73.37% పోలింగ్ జరిగింది. అంటే మొత్తంగా చూస్తే

మిగతా 3లో

# ఓటు హక్కుని వినియోగించుకున్న కెసిఆర్



**యదార్థవాది, చింతమడక, 30 నవంబరు :** తెలంగాణ సీఎం చంద్రశేఖర్ రావు అసెంబ్లీ ఎన్నికలు-2023లో ఓటు హక్కుని వినియోగించుకున్నారు. భార్య శోభతో కలిసి వచ్చి ఓటు వేశారు. సిద్దిపేట రూరల్ మండలంలోని చింతమడక గ్రామంలోని తన ఓటు హక్కుని వినియోగించుకున్నారు. మంత్రి కేటీఆర్ దంపతులు కూడా ఓటు వేశారు. ఇక మంత్రి హరీశ్ రావు దంపతులు కూడా సిద్దిపేటలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరోవైపు.. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కొడంగల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుటుంబసమేతంగా వెళ్లి కొడంగల్‌లోని జెడ్‌పీహెచ్ఎస్ బాయ్స్ సౌత్ వింగ్ పోలింగ్ బూత్‌లో (బూత్ నెం.237)

మిగతా 4లో

# సుప్రీంకోర్టులో చంద్రబాబు ముందస్తు బెయిల్ వాయిదా



**యదార్థవాది, న్యూఢిల్లీ, 30 నవంబరు :** ఫైబర్ నెట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముందస్తు బెయిల్ పిటీషన్‌పై విచారణ సుప్రీం కోర్టులో వాయిదా పడింది. డిసెంబర్ 12కు ఈ కేసుపై విచారణను

మిగతా 6లో

# జగన్నాటకం!

- తెలంగాణ పోలింగ్‌కు కొద్ది గంటల ముందు సాగర్ డ్యామ్ వద్ద అర్ధరాత్రి హైడ్రామా
- డ్యామ్‌పైకి ఏపీ పోలీసులు, అధికారులు
- ఎస్పీఎఫ్ సిబ్బందిని కొట్టి.. గేట్లు తెరిచి దౌర్జన్యం
- 13వ గేటు నుంచి ఏపీదేనంటూ కంచె ఏర్పాటు
- బెటాలియన్‌ను దింపిన తెలంగాణ అధికారులు
- కుడి కాల్వ గేట్లు ఎత్తకుండా విద్యుత్తు నిలిపివేత
- అయినా 2 వేల క్యూసెక్కుల నీరు తీసుకున్న ఏపీ
- ఓటమి భయంతో బీఆర్ఎస్ కుట్ర: రేవంత్‌రెడ్డి
- బీఆర్ఎస్, వైసీపీ దొంగ నాటకమిది: కిషన్‌రెడ్డి
- బలవంతంగా నీటి విడుదల ఆక్షేపణీయం



- 2 రాష్ట్రాల పాలకుల ఎన్నికల ఎత్తుగడలా ఉంది
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆగ్రహం

**యదార్థవాది, నాగార్జునసాగర్/హైదరాబాద్, 30 నవంబరు :** తెలంగాణలో మరికొద్ది గంటల్లో పోలింగ్ ప్రారంభమవుతుందనగా.. నాగార్జున సాగర్ కేంద్రంగా జగన్నాటకం జరిగింది! బుధవారం అర్ధరాత్రి.. ఏపీ

మిగతా 3లో

# కాంగ్రెస్ సునామీ

- మాదే అధికారమని అన్ని సర్వేలూ చెబుతున్నాయి
- ప్రజాస్వామిక పాలన, 6 గ్యారెంటీలకు చట్టబద్ధతే లక్ష్యం
- ఇక సభల్లో విపక్షానికీ చాన్స్.. కేసీఆర్‌లాగా ఉండబోం
- కొడంగల్, కామారెడ్డి.. 2 చోట్లా నేను గెలవబోతున్నా
- మీడియాకు స్వేచ్ఛ.. విలేకర్ల సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- కామారెడ్డిలో విలేకరులతో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

**యదార్థవాది, కామారెడ్డి, కోస్గి, 30 నవంబరు :** 'తెలంగాణలో కాంగ్రెస్ సునామీ వచ్చింది.. ఈ సునామీలో గడ్డపారలే కొట్టుకుపోతాయి.. కేసీఆర్‌లాంటి గడ్డిపోచలు

మిగతా 4లో

# కవిత ఎన్నికల కోడ్ ఉల్లంఘన



**యదార్థవాది, హైదరాబాద్, 30 నవంబరు :** బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవిత ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. బంజారాహిల్స్ లోని నందినగర్ ప్రాంతంలో డీఏవీ స్కూల్ పోలింగ్ స్టేషన్ లో కవిత ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆ తర్వాత కవిత మీడియాతో మాట్లాడారు. ప్రజలు అందరూ తమ బాధ్యతను నిర్వర్తించాలని అందరూ ఓటు వేయాలని పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎలక్షన్ కోడ్‌ను ఉల్లంఘించేలా కవిత వ్యాఖ్యలు చేశారు. తమకు ఓటు వేయాలనే వ్యాఖ్యలు చేయకూడదనే నిబంధనలు ఉన్న సంగతి తెలిసిందే. కవిత వ్యాఖ్యలపై తెలంగాణ

మిగతా 6లో

# ఎగ్జిట్ పోల్స్‌తో కంగుతిన్న 'కారు'..

## డైలామాలో కేసీఆర్!!




**యదార్థవాది, హైదరాబాద్, 30 నవంబరు :** తెలంగాణ దంగల్ ముగిసింది. పోలింగ్ ముగియడంతో ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. డిసెంబర్-03 ఎప్పుడెప్పుడు వస్తుందా..? అని ఎన్నికల్లో పోటీచేసిన

మిగతా 2లో

# జగన్‌కు కమీషన్లపై ఉన్న శ్రద్ధ పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనపై లేదు



**యదార్థవాది, కాకినాడ, 30 నవంబరు :** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాద యాత్ర జిల్లాలో కొనసాగుతోంది. గురువారం కాకినాడ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని తాళ్లరేవు మండలంలో 213వ రోజు పాదయాత్రను లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తాళ్ళరేవులో లోకేష్‌ను పలువురు నిరుద్యోగులు కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు.దీనిపై నారా లోకేష్ స్పందిస్తూ... ముఖ్యమంత్రి జగన్‌కు కమీషన్లపై ఉన్న శ్రద్ధ పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనపై లేదన్నారు. చంద్రబాబు తెచ్చిన కంపెనీలను జే ట్యాక్స్ కోసం వేధించి తరిమేశారని మండిపడ్డారు. జే - గ్యాంగ్ పుణ్యమా

మిగతా 5లో



యదార్థవాది, ఆళ్లపల్లి - 30, నవంబర్ : ఎన్నికల నేపథ్యంలో ఆళ్లపల్లి మండలంలో గురువారం పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో మండలంలోని 11 పోలింగ్ కేంద్రాలలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. పోలీస్ బలగాల పహారాలో ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా జరిగినట్లు ఎన్నికల అధికారులు రామారావు, శ్రీనివాస, ఎస్సై రతీష్ లు వెల్లడించారు. మండల వ్యాప్తంగా 11 పోలింగ్ స్టేషన్ లలో మొత్తం 8681 ఓటర్లకు గాను పురుషులు 4372 ఓటర్లు ఉండగా, మహిళా ఓటర్లు 4309 ఉన్నారు. రామంజిగూడెంలోని పురుషులు 400, మహిళలు 414 మొత్తం 814 ఓట్లు పోలయ్యాయి. అనంతోగులోని మొత్తం 667 గాను, పురుషులు 288, మహిళలు 356 ఓట్లు వినియోగించుకున్నారు. రాయపాడులోని 571 ఓట్లకు గాను, పురుషులు 282, మహిళలు 242 మొత్తం 524 వినియోగించుకున్నారు. ఆళ్లపల్లిలోని 1014 ఓట్లుండగా పురుషులు 466, మహిళలు 445 మొత్తంగా 911 మంది ఓటేశారు. 19 వ బూత్ లొ 1142 గాను పురుషులు 511, మహిళా ఓటర్లు 476 మొత్తం 987 మంది ఓటింగ్ నమోదయింది. 20వ బూతు మర్కోడ్ మొత్తంగా 1246కు గాను పురుషులు 524, మహిళా ఓటర్లు 555 గాను మొత్తం 1079 పోలింగ్ నమోదయింది. 21వ బూతు మర్కోడులోని 762కు గాను మొత్తం 681 ఓట్లు పోలయ్యాయి, 22వ బూతు మర్కోడ్లోని 845 ఓట్లుకు గాను 797 ఓట్లు పోలయ్యాయి, 23వ బూత్ లొ మొత్తంగా 539 ఓట్లకు గాను 490 ఓట్లు పోలయ్యాయి. 24వ బూతు లొ మర్కోడ్లోని మొత్తం 485 ఓట్లకు గాను 432 పోలయ్యాయి. అలాగే 25వ బూత్ పెద్ద వెంకటాపురం లో 495 ఓట్లుకు గాను పురుషులు 233 ఓటర్లు, మహిళలు 234 ఓటర్లుగా నమోదు అయ్యాయి. పోలింగ్ ఉదయం 7 నుండి సాయంత్రం 4 గంటల వరకు జతిగింది. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి, స్థానిక ఎంపీడీవో మార్తి రామారావు, ఎంపీఒ బత్తిని శ్రీనివాసరావు, ఏఎస్ఐ వెంకటరెడ్డి, ఆర్ఐలు సోయం రామయ్య, బుల్లిబాబు, కార్యదర్శి రాసమల్ల ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎగ్జిట్ పోల్స్‌తో కంగుతిన్న 'కారు'..

(మొదటి పేజీ తరువాయి భాగం)

అభ్యర్థులు, తెలుగు ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఇక బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మాత్రం అదిగో అధికారంలో వచ్చేస్తున్నాం.. ఇదిగో ప్రమాణ స్వీకారమే ఇక ఆలస్యం అంటూ చెప్పుకుంటున్నాయి. అయితే.. నవంబర్-30న తెలంగాణలో ఎన్నికల పోలింగ్ ముగిసింది. అటు పోలింగ్ ముగియగానే ఇటు ఎగ్జిట్ పోల్స్ కూడా వచ్చేశాయి. ఈ ఎగ్జిట్స్ పోల్స్‌తో అధికార బీఆర్ఎస్ కంగుతినగా.. కాంగ్రెస్ మాత్రం అంతా అనుకున్నదే అక్షరాలా నిజం అవుతోందని చెప్పుకుంటోంది.

అవును.. హ్యాట్రిక్ కొట్టబోతున్నాం.. ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిని కాబోతున్నా.. ఇందులో ఎటువంటి సందేహాలు అక్కర్లేదు.. రాసిపెట్టుకోండి.. ఇవీ గులాబీ బాస్ కేసీఆర్ నోట పదే పదే వచ్చిన మాటలు. కట్ చేస్తే.. సీన్ మొత్తం రివర్స్ అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని స్పష్టంగా అర్థమవుతోంది. గురువారం సాయంత్రం సుమారు 20కి పైగా రాష్ట్ర, జాతీయ ప్రముఖ మీడియా సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌ను వెల్లడించాయి. ఇందులో ఒకటి అర మాత్రమే బీఆర్ఎస్ గెలుస్తుందని తేల్చగా.. మిగిలినవన్నీ కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోందని స్పష్టం చేశాయి. మరికొన్ని సర్వేలు మాత్రం మ్యాజిక్ ఫిగర్‌కు అటు ఇటుగా కాంగ్రెస్‌కు సీట్లు రావొచ్చని వెల్లడించాయి. అంటే ఇంచుమించు 90 శాతం ఎగ్జిట్ పోల్స్ గులాబీ పార్టీకి ఈ ఎన్నికల్లో నెగిటివ్ ఫలితాలే రానున్నాయని జోస్యం చెప్పేశాయన్న మాట. దీంతో ఒక్కసారిగా గులాబీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెత్తడం మొదలయ్యిందట. అనుకున్నదొక్కటి.. అయినదొక్కటి అన్నట్లుగా పరిస్థితి మారిపోయిందట. ఇక సోషల్ మీడియాలో అయితే.. లెక్కలేనన్ని పోస్టులు, అంతకుమించి మీమ్స్ వైరల్ అవుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో 'కారు.. సారు.. రారు' అన్నది అక్షరాలా నిజమవుతుందని నెటిజన్లు చెప్పుకుంటున్న మాట.

ఈ ఎగ్జిట్ పోల్స్‌తో 'కారు' పార్టీ అధిష్టానం కంగుతిన్నదట. ఇక కేసీఆర్ అయితే.. 'ఎందుకిట్ల జరిగింది'.. 'ప్రభుత్వంపై ప్రజలు ఎందుకింత వ్యతిరేకతతో ఉన్నారు' అంటూ డైలమాలో పడ్డారట. మంత్రి కేటీఆర్ ఒక్కరు తప్ప ఇంతవరకూ ఈ ఎగ్జిట్ పోల్స్‌పై బీఆర్ఎస్ నేతలు నోరు మెదపట్లేదు. ఏదో నిశ్శబ్ద యుద్ధమే జరిగిందని భావిస్తున్నారట.

మరోవైపు ఆఖరి నిమిషంలో రాజకీయ చాణక్యుడైన కేసీఆర్ ఏదో ప్లాన్ చేశారనే టాక్ కూడా నడుస్తోంది. ఇవాళ రిలీజ్ అయిన ఎగ్జిట్ పోల్స్ అక్షరాలా నిజమయ్యే అవకాశాలు లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాట. వాస్తవానికి మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం కష్టమేనని మొదట్నుంచీ గ్రౌండ్ లెవల్‌లో టాక్ నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇదే విషయాన్ని జనాల్లోకి తీసుకొని వెళ్లడంలో.. ప్రభుత్వం వ్యతిరేకతను, స్కామ్స్, ఉద్యోగాలు వదలట్లేదనే విషయం, ఆఖరి నిమిషంలో రైతుబంధు ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయని రాజకీయ పండితులు చెబుతున్న మాట. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ దుందుభి మోగించిన తర్వాత తెలంగాణలో పరిస్థితులన్నీ ఒక్కసారిగా మారిపోయాయన్నది జగమెరిగిన సత్యమే. మరోవైపు.. ఎగ్జిట్ పోల్స్ కచ్చితంగా తప్పేనని కేటీఆర్.. అబ్బే ఇవన్నీ తారుమారవుతాయని రాసిపెట్టుకోండి అంటూ బీజేపీ కీలక నేతలు చెబుతున్న మాట.

### అయ్యో సారూ..!!

ఇక గెలిచేస్తున్నాం.. వాట్ నెక్స్ట్ అంటూ రెండ్రోజులుగా కేసీఆర్ సమాలోచనలు చేస్తున్నట్లుగా పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు చెప్పుకున్న పరిస్థితి. 'అధికారంలోకి రాగానే ఏం చేయాలి..? తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఏమేం చేయాలి..?' అని ముఖ్యనేతలతో సమాలోచనలు చేసినట్లు వార్తలు వచ్చాయి.

అంతేకాదు.. మూడోసారి ముఖ్యమంత్రి గా డా. బిఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని కూడా బీఆర్ఎస్ పెద్దలు పదే పదే చెబుతూ వచ్చారు.





- ఊపిరి పిలుచుకున్న అధికారులు..
- గతం కంటే తగ్గిన పోలింగ్ శాతం
- 83 శాతం నమోదు

యదార్థవాది,సత్తుపల్లి - 30, నవంబర్ : చెదురు మోదురు సంఘటనలు మినహా సత్తుపల్లి నియోజకవర్గంలో పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. అక్కడక్కడ ఈవీఎంలు మొరాయించటంతో పోలింగ్ ఆలస్యంగా కొంత మొదలైంది. సత్తుపల్లి మండలం రుద్రాక్ష పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సత్యం పేట గ్రామంలో అభివృద్ధి పనులు ఏమీ జరగలేదంటూ గ్రామస్తులు ఓటు వేసేందుకు నిరాకరించారు. ఈ పరిణామం ఎమ్మెల్యే సండ్రకు అవమానం కలిగించింది. ఎన్నికల అధికారులు నచ్చచెప్పడంతో పోలింగ్ లో పాల్గొనేందుకు గ్రామస్తుల అంగీకరించారు. దీంతో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. సత్తుపల్లి పట్టణంలోని జలగం వెంగళరావు డిగ్రీ కళాశాల పోలింగ్ బూతులోకి బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా వెళుతుండటంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డగించారు. దింతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వతావర్ణం ఏర్పడింది. ఈ సంఘటనలో పోలీసులు ఇరు వర్గాల నాయకులు, కార్యకర్తలను చదరగొట్టారు. కాకలపల్లి గ్రామంలోనూ బి ఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గొడవలు జరిగాయి. బేతపల్లి గ్రామంలో ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఈవీఎంలు ఏర్పాటు చేయకపోవడంతో పోలింగ్ ఆలస్యమైది. ఓటర్లు అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కల్లూరు మండలం చెన్నూరు పోలింగ్ బూత్ లోను బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య స్వల్ప వివాదం జరిగింది. ఇలా చెదురు, మొదురు సంఘటనలు మినహాయిస్తే పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ అధికారులు పోలీసు అధి కారులు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు సహకరించటం పట్ల ప్రజలను అభినందించారు. పోలింగ్ ముగిసే సమయానికి 83 శాతం వరకు నమోదు అయినట్లు తెలిసింది. ఉదయం 9 గంటల నుంచి పోలిక ప్రక్రియ ప్రారంభమైంది. పోలింగ్ తోలుత రెండు మూడు గంటల వరకు మందకోడిగా సాగింది. కాగా గత అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లి నియోజకవర్గంలో 89 శాతం ఓటింగ్ నమోదు అయింది.

తల్లాడ మండలంలో 44959 ఓట్లు, కల్లూరు మండలంలో 52629, పెనుబల్లి మండలంలో 42421, సత్తుపల్లి మండలంలో 62632, వెంసూర్ మండలంలో 35993 ఓట్లు ఉండగా ఇందులో 83 శాతం పోలింగ్ జరిగింది. బిఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య కుటుంబ సభ్యులు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ అభ్యర్థిని డాక్టర్ మట్టా రాగమయి పాత సెంటర్ లోనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బిజెపి అభ్యర్థి నంబూరు రామలింగేశ్వర రావు పాత సెంటర్లోని హైస్కూల్లో ఓటు హక్కు నియమించుకు న్నారు. ఐదు మండలాల పరిధిలో 292 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు 1168 సిబ్బందిని నియ మించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు 584 పోలీసులను వినియోగించారు. 27 సెక్టార్లుగా విభజించి 56 మంది మైక్రో అబ్జర్వర్లను 20 మంది కాస్టింగ్ సిబ్బంది కోసం తొంబై బస్సులను వినియోగించారు.

## రేగాను దూషించిన మహిళలు..

- అమ్ముడుపోయి ఏం ముఖం పెట్టుకుని వచ్చావు..
- బియర్ ఎస్ ఎమ్మెల్యే రేగా పై విమర్శలు



యదార్థవాది, కొత్తగూడెం బ్యూరో - 30, నవంబర్ : గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలిపిస్తే టిఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోయి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగటానికి వచ్చవంటూ కొందరు మహిళలు పినపాక ఎమ్మెల్యే, బియర్ ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు పై విరుచుకుపడ్డారు. అనేక గ్రామాల్లో ఆయనకు గురువారం జరిగిన పోలింగ్లో అవమానాలు ఎదురైనట్లు తెలుస్తుంది. పోలింగ్ సరళిని పరిశీలించేందుకు ఆయన అనేక గ్రామాల్లో పర్యటించారు. ఈ క్రమంలో రేగాకు చాలా చోట్ల అవమానాలు ఎదురయ్యాయని తెలుస్తుంది. రేగ మహిళలపై దురుసుగా ప్రవర్తించిన వీడియోలు జిల్లాలో వైరల్ అవుతున్నాయి. అదేవిధంగా ఒక మహిళపై షూ తో కొట్టే ప్రయత్నం చేసిన వీడియో కూడా బయటపడింది. తొలుత ఒక ఒక పోలింగ్ కేంద్రం వద్ద నిబంధనలకు విరుద్ధంగా రేగా తన అనుచరులతో దూసుకెళ్లే క్రమంలో అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. అప్పటికే కోపంలో ఉన్న రేగా పోలీసులతో దురుసుగా ప్రవర్తించినట్లు వీడియోలు బయటపడ్డాయి. దీంతో అక్కడే ఉన్న ప్రత్యేక పోలీస్ బృందం కూడా ఆయన తీరును తప్పుపట్టారు. దింతో ఆయన వర్గానికి పోలీసులతో తీవ్ర వాగ్వాదం తోపులాట చోటు చేసుకోవడం గమనార్హం. అదేవిధంగా కొన్ని గ్రామాల్లో రేగాకు అవమానాలు ఎదురయ్యాయి. ముఖ్యంగా మహిళలు యువకులు ఆయన రాకపట్ల వ్యతిరేకించారు. ఒక పోలింగ్ బూత్ వద్ద రేగాను ప్రశ్నించిన మహిళపై తన కాలి బూటును తీసి కొట్టేందుకు ప్రయత్నించాలని విమర్శలు వచ్చాయి. పక్కనే ఉన్న మండల అధ్యక్షుడు సతీష్ రెడ్డి తనపై చేయి చేసుకున్నాడని ఆ మహిళ ఆరోపించింది. సిగ్గులేని దరిద్రులు డబ్బుకోసం పార్టీలకు అమ్ముడుపోయి మహిళలపై చేయి చేసుకుంటున్నారని వారు విమర్శించారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన పోలింగ్ ప్రక్రియను చూసిన రేగా చాలా ఫ్రస్టేషన్లో కనిపించినట్లు తెలుస్తుంది. తన ఓటమికి సంకేతాలు కనిపించాయని అందుకే ఆయన ప్రతి చిన్న విషయంలోను ఆయన గొడవకు దిగడానికి ప్రైమ్ టైమ్ కు చెప్పారు.



## బద్ధకానికి బ్రాండ్ అంబాసిడర్

యదార్థవాది, హైదరాబాద్, 30 నవంబరు : తెలంగాణ వ్యాప్తంగా పోలింగ్ సందడి కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రావ దగ్గర క్యూ కట్టారు. రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులూ, ఇతర అధికారులు కూడా ఓట్లు వేయడానికి తరలివస్తున్నారు. అయితే తెలంగాణ రాష్ట్రం మొత్తం ఓ లెక్క..హైదరాబాద్ ఒక్కటి మరోలెక్క అన్నట్టు పరిస్థితి మారింది. ఈ ఏడాది కూడా హైదరాబాద్ లో ఓటింగ్ శాతం తక్కువే నమోదయ్యేట్టుంది. తెలంగాణ వ్యాప్తంగా అతి తక్కువ ఓటింగ్ హైదరాబాద్ లోనే కావడంతో ఈ డిస్కషన్ జరుగుతోంది.ఎన్నికల రోజును ప్రభుత్వం పెయిడ్ హాలిడేగా ప్రకటిస్తోంది. ప్రైవేటు సంస్థలు కూడా దీన్ని అమలు చేస్తున్నాయి. అయినా ఓటేసేందుకు ఓటర్లు పెద్దగా ఉత్సాహం చూపించడం లేదు. బారెడు పొద్దెక్కినా ఏదో వీకెండ్ రోజు రిలాక్సవుతున్నట్టు ఇల్లు దాటి బయటకు రావడం లేదు.

ఇల్లు కదలనివారు కొందరైతే...హాలిడే వచ్చిందంటూ సొంత పనులు చూసుకుంటున్నవారు మరికొందరు. సెలవు ప్రకటించి మరీ ఓటేయమంటే భాగ్యనగర వాసుల తీరు ఇలా ఉందిభాగ్యనగర ఓటర్ల తీరును కొందరు నెటిజన్లు ఎండగడుతున్నారు. తెల్లారితే నీళ్లు రావడం లేదు, రోడ్లు బాలేవు, ఈ సమస్య ఆ సమస్య అంటూ హడావుడి చేసేవారంతా తన బాధ్యతను నిర్వర్తించే రోజు వచ్చేసరికి మాత్రం బద్ధకం చూపిస్తు న్నారంటున్నారు. ఉదయం 11 గంటలు గడిచినా హైదరాబాద్ లో కేవలం 12 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది...ఉదయం 11 గంటల వరకూ హైదరాబాద్ లో 9.57 శాతం మాత్రమే ఓటింగ్ నమోదయ్యింది హైదరాబాద్ లో అత్యల్పంగా నాంపల్లిలో 2.5 శాతంసనత్ నగర్ లో 1.2 శాతంకూకట్పల్లిలో 3.9 శాతంమేడ్చల్లో 4 శాతంగోషామహల్ లో6 శాతంచార్మినార్లో8 శాతంముషీరాబాద్ లో 7 శాతంరాజేంద్రనగర్ లో అత్యధికంగా 15 శాతం పోలింగ్ నమోదయ్యింది. అర్బన్ ఓటింగ్ చాలా దారుణంగా ఉంటోందని కల్వకుంట్ల కవిత అన్నారు. పట్టణ ఓటర్లు కచ్చితంగా పోలింగ్ బూత్ కు రావాలని పిలుపు ఇచ్చారు. గత ఎన్నికల్లో కూడా గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ మెరుగ్గా ఉన్నప్పటికీ అర్బన్ ఏరియాల్లో చాలా దారుణంగా ఉందని అన్నారు.

తెలంగాణ వ్యాప్తంగా ఉదయం పోలింగ్ ప్రశాంతంగా ప్రారంభం కాగా ఆ తర్వాత ఘర్షణల వాతావరణం హోరెత్తింది. జనగామ జిల్లాలో మరోసారి ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. జనగామ జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియ ర్ కళాశాల 245 పోలింగ్ కేంద్రం వద్ద ఘర్షణ వాతావరణం రేగింది. బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ పరిస్థితి ఏర్పడింది. బీఆర్ఎస్ కార్యకర్తలు పోలింగ్ కేంద్రం వద్ద అధిక సంఖ్యలో ఉండడంపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పరస్పరం ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో లాఠీలకు పని చెప్పి పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.





యదార్థవాది, భద్రాద్రి కొత్తగూడెం క్రైమ్ - 30, నవంబర్ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం జరిగిన పోలింగ్ సందర్భంగా కలెక్టర్ పాల్వంచలోని 72వ పోలింగ్ బూత్ లొ తన ఓటు వేశారు. ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. అదేవిధంగా జిల్లా ఎస్పీ వినీత్ శ్రీ ఇంక్లైన్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎస్పీ తనతోపాటు తన సతీమణి ప్రీతిని కూడా వెంట తీసుకొచ్చి ఆమెను కూడా ఓటు హక్కు వినియోగించుకునేలా చేశారు. ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక కోరారు.

## ఈవీఎంలలో భవితవ్యం

**చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసిన పోలింగ్**

**3న ఫలితాలు..అభ్యర్థుల్లో ఉత్కంఠ**



యదార్థవాది, హైదరాబాద్, 30 నవంబర్ : చెదురు మదురు ఘటనలు మినహా తెలంగాణ శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈవీఎంలలో నిక్షిప్తమైన 2,290 మంది అభ్యర్థుల భవితవ్యం ఈనెల 3న తేలిపోనుంది. ఆ రోజు ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. అదే రోజు మధ్యాహ్ననానికి గెలుపోటములపై స్పష్టత రానుండగా, సాయంత్రానికి పూర్తి ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈసారి అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోరు హెరాహెరీగా సాగటంతో ఓటరు తీర్పు ఎలా ఉండబోతుందన్న దానిపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభమై సాయంత్రం ఐదు గంటలకే ముగియగా, అప్పటి వరకు క్యూలో ఉన్న వారిని కూడా అనుమతించటంతో కొన్నిచోట్ల పొద్దుపోయే వరకు పోలింగ్ కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా 35,655 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, సుమారు రెండున్నర లక్షలమంది సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అన్ని నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులను బరిలోకి దింపగా, ఈసారి స్వతంత్రులు కూడా భారీగానే రంగంలోకి దిగారు.

### లెక్కింపునకు ఏర్పాట్లు

3న జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. మొత్తం 49 ప్రాంతాల్లో లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేసింది.119 నియోజకవర్గాలకు గాను 119 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎక్కువ పోలింగ్ కేంద్రాలున్న పది నియోజకవర్గాలు మినహా ఒక్కో నియోజకవర్గంలో 14o1 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. కూకట్‌పల్లి, ఉప్పల్, మల్కాజ్‌గిరి, పటాన్‌చెరు తదితర నాలుగు నియోజకవర్గాల్లో 400లకుపైగా పోలింగ్ కేంద్రాలు ఉండటంతో ఈ నియోజకవర్గాల్లో 20o1 టేబుళ్లు.. రాజేంద్రనగర్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం, కూకట్‌పల్లి, మేడ్చల్ తదితర ఆరు నియోజకవర్గాల్లో 500లకుపైగా పోలింగ్ కేంద్రాలు ఉండటంతో 28o1 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. లెక్కింపులో జాప్యం జరగకుండా ఉండేందుకే ఈ ఏర్పాట్లు. తెలంగాణ శాసనసభ ఎన్నికలకు నవంబర్ 3న షెడ్యూల్ విడుదల కాగా, 28న ప్రచారానికి తెరపడింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఇవి మూడో ఎన్నికలు. గత రెండు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అద్వితీయ మెజార్టీతో విజయం సాధించింది. ఈసారి కూడా గెలిచి హ్యాట్రిక్ నమోదు చేస్తామన్న ధీమాతో ఉంది.



**యదార్థవాది, ఎల్బీనగర్, 30 నవంబరు :** అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో అధికార పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను భయపెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ ఆరోపించారు. గురువారం ఆయన వనస్థలిపురంలో విలేకరులతో మాట్లాడారు. ఓటమి భయం వెంటాడుతుండడంతో అధికార పార్టీ అభ్యర్థి సుధీర్ రెడ్డి.. ఎల్బీనగర్ నియోజకవర్గంలో అడ్డదారులు వెతుకుతున్నారనన్నారు. అలాగే పోలీసులు కూడా ఓవర్ యాక్షన్ చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల నిర్వహణను పరిశీలిస్తున్న తనను పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. పోలింగ్ భూతుల వద్ద పోలీసులు.. కాంగ్రెస్ నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులంతా సుధీర్ రెడ్డికి చెంచాగిరి చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## పోటెత్తిన ఓటరు

(మొదటి పేజీ తరువాయి భాగం)

పోలింగ్ శాతం గత ఎన్నికల కంటే ఎక్కువగానే నమోదయ్యే అవకాశాలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఉదయం 7 గంటలకు మందకొడిగా ప్రారంభమైన పోలింగ్.. ఆ తర్వాత వేగం పుంజుకున్నది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 30 శాతానికి పైగా పోలింగ్ నమోదు కాగా.. సాయంత్రం 5 గంటలక్కు 63.94 శాతం పోలింగ్ నమోదైంది. చివరి గంటలో బాగా వేగం పుంజుకుంది. క్యూలలో మహిళలు ఎక్కువగా కనిపించారు. ఎప్పటిమాదిరిగానే పట్టణ ఓటర్లు కాస్త నిర్లిప్తతను ప్రదర్శించారు. గ్రామీణ ఓటర్లు మాత్రం ఓటు హక్కును వినియోగించుకోవడానికి అమిత ఉత్సాహాన్ని కనబర్చారు. కొడంగల్, నిర్మల్, సిర్పూర్, రాజేంద్రనగర్‌లోని మణికొండ, నల్లగొండ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల నేతలు, కార్యకర్తల మధ్య తోపులాటలు, గొడవలు, గలాటాలు చోటు చేసుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడడంతో.. పోలీసులు జోక్యం చేసుకుని, లాఠీలు ఝుళిపించి, ఆందోళనకారులను చెదరగొట్టి, పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. సిర్పూర్‌లో బీఆర్ఎస్ పార్టీ అక్రమాలకు పాల్పడిందని కాంగ్రెస్, బీజేపీ నేతలు ఆరోపించారు. అక్కడ రీపోలింగ్‌కు డిమాండ్ చేశారు. ఈవీఎంలు మొరాయించడం, క్యూలలో ఇంకా ఓటర్లు నిలిచి ఉండడంతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం రాత్రి 12 గంటల వరకూ ఫైనల్ పోలింగ్ శాతాన్ని ప్రకటించలేకపోయింది. కాగా.. ఈసారి 119 నియోజకవర్గాల్లో 2,290 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరి భవితవ్యం ఎన్నికల బాక్సుల్లో నిక్షిప్తమైంది. వీరిలో ఎవరు విజేతలో.. ఎవరు పరాజితులో ఆదివారం తేలనుంది.

### ఏ జిల్లాలో ఎలాగంటే..

రాష్ట్రంలోని నల్లగొండ, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో పోలింగ్ వేగంగా సాగింది. ఈ రెండు జిల్లాల్లో సాయంత్రం 7 గంటలకే 76 శాతానికి పైగా పోలింగ్ జరిగింది. వరంగల్ జిల్లాలో కూడా 74 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కూడా 70 శాతానికి పైగా పోలింగ్ జరగడం గమనార్హం. హైదరాబాద్, రంగారెడ్డి వంటి పట్టణ ప్రాంత నియోజకవర్గాల్లో 2018 ఎన్నికల మాదిరిగానే పోలింగ్ మందకొడిగా సాగింది. నగరంలోని సంపన్న వర్గాలుండే ప్రాంతాల నుంచి పెద్దగా ఓటర్లు కదిలిరాలేదు. దీంతో హైదరాబాద్ జిల్లాలో సాయంత్రం 7 గంటల సమయానికి 40.93 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 55% ఓటింగ్ మాత్రమే నమోదైంది. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ గడువు ముగిసినప్పటికీ... ఆలోపు పోలింగ్ బూత్‌లలోకి ప్రవేశించి, క్యూలలో నిలబడిన ఓటర్లకు ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. దీంతో పోలింగ్ శాతం జిల్లాలవారీగా, నియోజకవర్గాలవారీగా మరింత పెరిగే అవకాశాలున్నాయి. నియోజకవర్గాలవారీగా చూస్తే.. మునుగోడు సెగ్మెంట్‌లో అత్యధికంగా 91.51 శాతం, అత్యల్పంగా రాజధాని పరిధిలోని యాకుత్‌పురా నియోజకవర్గంలో 39.69% పోలింగ్ నమోదైంది.

### ఏ సమయానికి ఎంతంటే..

రాష్ట్రంలో మొత్తం 3,26,18,205 మంది ఓటర్లు ఉండగా.. 2.10 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయ వర్గాల ద్వారా తెలిసింది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు 7.78%.. 11 గంటల సమయానికి 20.64 శాతం.. మధ్యాహ్నం 3 గంటల సమయానికి 51.89%.. 5 గంటల సమయానికి 63.94% మేర పోలింగ్ జరిగింది. చాలా నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటల తర్వాత ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడంతో చివరి గంటలో పోలింగ్ పెరిగింది. కాగా.. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగిసింది. సిర్పూర్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లెందు, కొత్తగూడెం, అశ్వారావుపేట, భద్రాచలం నియోజకవర్గాల్లో గంట ముందే పోలింగ్‌ను ముగించారు. మిగతాచోట్ల మాత్రం సాయంత్రం 5 గంటల వరకు, ఆ తర్వాత కూడా ఓటింగ్ జరిగింది. అనంతరం పోలింగ్ సిబ్బంది.. ఈవీఎంలు, వీవీప్యాట్‌లను ప్రత్యేక స్టోరేజీ కేంద్రాలకు తరలించి, భద్రపర్చారు.

### ఆదర్శం.. ఆ తరం

కొత్తగా ఓటు వేసే అవకాశం వచ్చిందన్న ఆనందంలో యువతరం.. ఓటు వేయడం మరవొద్దనే బాధ్యతను చాటి చెప్పేందుకు వయసు పైబడిన పెద్ద మనుషులు.. ఇలా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారు. తొలిసారిగా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన నవతరంలో ఉత్సాహం కనిపించింది. ప్రభుత్వ ఏర్పాటులో అభిప్రాయాన్ని వ్యక్త పరిచే అవకాశం వచ్చిందన్న ఆనందం వారిలో కనిపించింది. అదే విధంగా వయసు మీరి, శరీరం సహకరించకున్నా.. వృద్ధులు వారి కుటుంబీకుల సాయంతో పోలింగ్ కేంద్రాలకు రావడం సమాజానికి గొప్ప సందేశాన్ని ఇచ్చింది. ఒంట్లో చేవ ఉన్నంత వరకు ఓటు వేయాలన్న వారి దృఢ సంకల్పం ఎందరికో ఆదర్శంగా నిలిచింది. అంగవైకల్యం ఉన్నా.. లెక్కచేయకుండా అనేక ప్రాంతాల్లో దివ్యాంగులు సైతం పోలింగ్ బూత్‌లకు తరలిరావడం ప్రజాస్వామ్య పరిణతికి నిదర్శనం.

కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా విద్యానగర్లోని పోలింగ్ కేంద్రంలో ఆయన గురువారం తన ఓటును సద్వినియోగం చేసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. ప్రజల ఉత్సాహం చూస్తుంటే తప్పకుండా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు కనిపించిందన్నారు.

కొత్తగూడెం నియోజకవర్గంలో సిపిఐ అభ్యర్థిగా తన విజయాన్ని కాంక్షిస్తూ రాత్రి పగలు పనిచేసిన మిత్రపక్ష పార్టీలకు, ఆయా నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్, సిపిఎం, టీజేఎస్, తెలుగుదేశం, ప్రజా పంథా, షర్మిల పార్టీ వైఎస్ఆర్పిపి తోపాటు కొత్తగూడెం లోని ప్రధాన ముస్లిం సంస్థల నాయకులకు, దళిత సంఘాల నాయకులు తనకోసం నిజాయితీగా శ్రమించారని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగూడెంలో నిశ్శబ్దంగా జరిగిన ఓటింగ్ శైలి, ప్రజల సహకారం చూస్తుంటే తప్పకుండా తనను గెలిపిస్తారని నమ్మకం



ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడితే వాగ్దానం చేసిన ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలయ్యేలా సిపిఐ పార్టీగా తమ వంతు కృషి చేస్తామని కూనంనేని హామీ ఇచ్చారు. అదేవిధంగా జిల్లాలోనూ కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగిందన్నారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలలోని 10 సీట్లలో అధిక శాతం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని చెప్పారు. ముఖ్యంగా మహిళలు, యువతరం ఓటింగ్లో ఉత్సాహంగా పాల్గొన్నారని ఈ పరిణామం ప్రభుత్వ మార్పుకు సంకేతంలా కనిపించిందన్నారు. పదేళ్లు అధికారం వెలగ బెట్టిన బిఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో వ్యతిరేకంగా కనిపించిందన్నారు. తెలంగాణలో తప్పకుండా కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందనే నమ్మకం కలిగిందన్నారు.

# కొత్తగూడెం జిల్లాలో 64 శాతం ఓటింగ్ నమోదు

- **అధికంగా అశ్వరావుపేటలో 71. 84 శాతం..**
  **అల్పంగా కొత్తగూడెంలో 64 పైబడి నమోదు**

**యదార్థవాది,భద్రాద్రి కొత్తగూడెం క్రైమ్ - 30, నవంబర్ :** తెలంగాణ రాష్ట్రంలోనే అధికంగా నక్సల్స్ ప్రభావిత ప్రాంతంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నమోదైవుంది. ఈ మేరకు ఎన్నికల సంఘం కూడా ఈ జిల్లాలో పోలింగ్ ప్రక్రియలో మార్పులు చేసింది. గురువారం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రక్రియను ముగించారు. కాగా జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో ఈ దఫా అసెంబ్లీ ఎన్నికల్లో 66.40 శాతం ఓటింగ్ మాత్రమే నమోదైంది. ఎన్నికల్లో 70 శాతం పైబడి ఓటింగ్ నమోదు చేయాలని జిల్లా అధికార యంత్రాంగం విశేష కృషి చేసింది. శాతం పైబడి ఓటింగ్ నమోదు కావాలని అధికారులు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. రాష్ట్రంలోనే సమస్యాత్మక ప్రాంతంగా భద్రాద్రి జిల్లాలోని మొత్తం ఐదు అసెంబ్లీ స్థానాలను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆ మేరకు పోలింగ్ సమయాన్ని కూడా మార్పులు చేసి నిర్వహించారు. ఎన్నికల చివరి అంకమైన పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్యంగా ఈ జిల్లాకు ఆనుకొని ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల సరిహద్దులు ఉన్నాయి. ఈ సరిహద్దులు యావత్తు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా ఉండటం విశేషం. జిల్లాలో 66.40 శాతం మేరకు పోలింగ్ నమోదైనట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అధికారికంగా వెల్లడించారు. ఈ ఐదు నియోజకవర్గాల్లో అత్యధికంగా అశ్వరావుపేట లో 71. 84 శాతం పోలింగ్ నమోదు కాగా అల్పంగా కొత్తగూడెం లో 64.73 శాతం నమోదయింది. పినపాక నియోజకవర్గం లో 65.02 శాతం ఇల్లందులో 65.19, భద్రాచలంలో 67.03 ఓటింగ్ శాతం నమోదైనట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ దఫా ఎన్నికల్లో అధికార పార్టీ తోపాటు ప్రతిపక్షాల నాయకులు చేపట్టిన విస్తృత ప్రచారాలు చూస్తే ప్రజలు





అధిక శాతం పోలింగ్లో పాల్గొంటారని భావించారు. కానీ దానికి భిన్నంగా ఓటింగ్ పరిణామాలు కనిపించాయి. కనీసం 70 శాతం కూడా దాటని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఆయా పార్టీల నాయకులు ఇంటింటికి వెళ్లి ఒక్కో ఓటుకు రూ.1000 నుంచి 3000 వరకు ముట్ట చెప్పినట్లు సమాచారం. డబ్బుల పంపిణీ బహిరంగ బహిరంగంగా జరిగినప్పటికీ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కంటికి కనిపించలేదని విమర్శలు వినిపించాయి. గత ఎన్నికల కంటే ఈ సారి అధికార పార్టీ అభ్యర్థులు జిల్లాలో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చుపెట్టినట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీ కూడా ఎంతో కొంత పోటీని తట్టుకునేందుకు డబ్బులు ఆమేరకు ఖర్చు పెట్టాల్సి వచ్చిందని తెలిసింది. అందుకే ఈ ఎన్నికలు చాలా ఖరీదైన ఎన్నికలుగా మారాయి. ఐదు స్థానాలలో 4 అసెంబ్లీ స్థానాలు రిజర్వ్ స్థానాలు అయినప్పటికి ఇక్కడ కూడా సుమారు ఒక్కో నియోజకవర్గంలో ప్రతి అభ్యర్థి రూ 15 నుంచి 20 కోట్ల పైబడి ఖర్చు పెట్టినట్లు సమాచారం. కాగా కొన్ని గ్రామాల్లోనే డబ్బులు పంపిణీ అడ్డుకున్నట్టు తెలిసింది. పోలీసులు వెళ్ళాక మళ్ళీ కార్యక్రమాన్ని కొనసాగించినట్లు కూడా తెలుస్తుంది. డబ్బులు తీసుకున్న ఓటర్లలలో 34 శాతం మంది తమ ఓట్లు వేయలేదనేది ఓటింగ్ సరళిని బట్టి స్పష్టమవుతుంది. కానీ ఈసారి జరిగిన ఎన్నికల్లో మహిళలు, యువకులు పోలింగ్లో అధికంగా పాల్గొన్నట్లు అర్థమవుతుంది. ఈ పరిణామం ప్రభుత్వం పై వ్యతిరేకత గానే విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా ప్రచారాల్లో మాత్రం నాయకులు, కార్యకర్తల ఉత్సాహం, హడావుడి తప్ప ప్రజల్లో ఓటింగ్ ఓటింగ్ రూపంలో ఆకర్షించలేకపోయారని పోలింగ్ సరళి చెప్తుంది. ఓటింగ్ పట్ల ప్రజల్లో అంత ఆసక్తి ఈదఫా కూడా కనిపించలేదు. అధికారులు మాత్రం గత ఎన్నికల కంటే కొంత వరకైనా మెరుగైన ఫలితాలు సాధించామని చెప్తున్నారు.

# ప్రగతి కొనసాగించాలి

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

**యదార్థవాది, మారేడ్‌పల్లి, 30 నవంబర్ :** రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో జరిగాయని, పోలీస్ యంత్రాంగం కూడా గట్టి బందోబస్తును ఏర్పాటు చేసిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం మారేడ్‌పల్లి లోని కస్తూర్బా గాంధీ కళాశాలలో ఓటు వేసిన అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విలేకర్లతో మాట్లాడారు. హైదరాబాద్ మినీ ఇండియా అని అన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన ప్రగతి భవిష్యత్‌లో మరింత ముందుకు సాగుతుందన్నారు. 9 సంవత్సరాల్లో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి మన కండ్ల ముందే కనిపిస్తుందని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అందరికీ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ప్రభుత్వం కల్పించిందన్నారు.

ప్రపంచంలోని అన్ని వర్గాల ప్రజలను తెలంగాణ సమాజం హక్కున చేర్చుకుందని, ప్రజలందరూ ఈ రోజు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఈ సంతోషం ఎల్లప్పుడూ కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను, ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే ప్రతి ఒక్కరికీ ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి సూచించారు. హైదరాబాద్‌లో ఓటు వేయడానికి ప్రజలందరూ ఈ సారి పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చారని వెల్లడించారు.

# 119 నియోజకవర్గాల్లో పోలింగ్

**యదార్థవాది, హైదరాబాద్, 30 నవంబరు :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏడు గంటలకు ప్రారంభమైంది. పోలింగ్ ప్రక్రియకు ముందు ఎన్నికల సిబ్బంది మాక్ పోలింగ్ నిర్వహించారు. రాష్ట్రవ్యా ప్తంగా 119 నియోజకవర్గాల్లో 2,290 మంది ఎన్నికల పోటీలో ఉన్నారు. మొత్తం పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో 2,067 మంది పురుషులు కాగా, 222 మంది మహిళా అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఇద్దరు థర్డ్ జెండర్లు పోటీలో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,655 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో 3,26,18,205 మంది ఓటర్లలో 1,63,13,268 మంది పురుషు లు, 1,63,02,261మంది మహిళా ఓటర్లు ఉన్నా రు. పీడబ్ల్యూడీ (దివ్యాంగులు) ఓటర్లు 5,06,921, థర్డ్ జెండర్లు 2,676 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నారై ఓటర్లు 2,944 మంది నమోదు చేసుకున్నారు.

జూబ్లీహిల్స్ లో సినీ నటుడు అల్లు అర్జున్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. జూబ్లీహిల్స్ లోని బీఎస్ఎన్ఎల్ పోలింగ్ బూత్ లో అల్లు అర్జున్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. జూబ్లీహిల్స్ లోని బిఎస్ఎన్ఎల్ పోలింగ్ బూత్లో లైన్లో నిలబడి మరీ అల్లు అర్జున్ తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. అక్కడ ఈవీఎం సమస్యతో ఇబ్బంది తలెత్తగా క్యూలైన్లో నిలబడిన అల్లు అర్జున్ ఎట్టకేలకు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓబుల్ రెడ్డి స్కూల్లో తన ఓటు హక్కును వినియోగించుకు నేందుకు వచ్చిన జూనియర్ ఎన్టీఆర్ ఓటర్లతో కలిసి క్యూలైన్లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకో వటం ఆసక్తిని కలిగించింది. జూనియర్ ఎన్టీఆర్ తో పాటు, ఎన్టీఆర్ సతీమణి, ఎన్టీఆర్ తల్లి ఓటు వేయ డానికి వచ్చారు . షాద్ నగర్లో సినీ నటుడు ప్రకాష్ రాజ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇదిలా ఉంటే ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కూడా తమ ఓటు హక్కును వినియోగించు కుంటున్నారు. నిర్మల్ జిల్లా ఎల్లపెల్లి లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బంజారాహిల్స్ లో ఎమ్మెల్సీ కవిత తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఇలా అభ్యర్థులతో పాటు సినీ సెలబ్రిటీలు, రాజకీయ ప్రముఖులు తమ ఓటు హక్కును వినియో గించుకుంటున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని పిలుపునిస్తున్నారు. బంజారాహిల్స్లోని పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్సీ కవిత తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి ఓటేయాలని కవిత పిలుపునిచ్చారు. పట్టణాల్లో ఓటింగ్ తక్కువ అన్న చెడ్డపేరు ఉందని అన్నారు. కాబట్టి.. నగరాలు, పట్టణాల్లోని వారు, యువత పెద్దఎత్తున ఓటింగ్లో పాల్గొనాలని సూచించారు.

వారు ప్రశ్నించగా.. 'తీస్తారా.. తీయరా?' అని గేటును లాగుతూ పెద్ద శబ్దం చేస్తూ గొడవకు దిగారు. అంతటితో ఆగకుండా.. ఏపీ వైపున ఉన్న లాంచీ స్టేషన్ నుంచి కొందరు పోలీసు అధికారులు కుడి ఎర్త్ డ్యాం పైకి చేరుకుని బలవంతంగా గేట్లను తెరిచారు. అడ్డుకోబోయిన ఎస్పీఎఫ్ సిబ్బందిపై దౌర్జన్యం చేసి సెల్‌ఫోన్లు లాక్కున్నారు. ఒకరిద్దరిపై చేయి కూడా చేసుకున్నట్లు సమాచారం. పోలీసులతోపాటు ఏపీ నీటి పారుదల శాఖ ఎస్ఈ, ఇతర సిబ్బంది కూడా వచ్చి కుడి కాల్వకు నీటిని విడుదలను చేసుకుంటామంటూ ఎస్పీఎఫ్ సిబ్బందితో గొడవకు దిగారు. అందుకు తమకు తెలంగాణ వైపు నుంచి నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు లేవని ఎస్పీఎఫ్ సిబ్బంది సమాధానమిచ్చారు. అయినప్పటికీ ఏపీ పోలీసులు, అధికారులు ఆగకుండా ప్రధాన డ్యాంపైకి చొచ్చుకుని వచ్చి మొత్తం 26 గేట్లలో 13వ నెంబరు గేటు నుంచి ఏపీ రాష్ట్రానికి చెందుతుందని చెబుతూ.. ఆ ప్రాంతం వద్ద ముళ్ల కంచె వేసి బారికేడ్లను అడ్డుగా పెట్టారు. ఎన్నెస్పీ ఉద్యోగులను కూడా ప్రధాన డ్యాంపైకి రానివ్వలేదు. తెలంగాణలో ఎన్నికలు ఉండటంతో అక్కడ కేవలం ఎస్పీఎఫ్ సిబ్బంది, స్థానిక పోలీసులు మాత్రమే ఆ సమయానికి అందుబాటులో ఉన్నారు. వారు ఏపీ పోలీసులను తీవ్రంగా ప్రతిఘటించి, కుడి కాల్వకు నీటిని విడుదల చేయకుండా అడ్డుకున్నారు. గురువారం ఉదయం తెలంగాణ నీటి పారుదల శాఖ అధికారులు.. కుడి కాల్వకు సంబంధించిన గేట్లను ఎత్తకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అలాగే, 12వ బెటాలియన్ నుంచి 400 మందిని ప్రధాన డ్యామ్‌పై దించి పహారా కాస్తున్నారు. ఏపీ వైపు నుంచి ఆ ప్రాంత పోలీసులు 1500 మంది.. 13వ గేటుకు అవతల బందోబస్తుగా ఉన్నారు.

### అయినా నీటి విడుదల..

గేట్లు ఎత్తకుండా తెలంగాణ అధికారులు విద్యుత్‌ను నిలిపివేయడంతో.. గురువారం మధ్యాహ్నం ఏపీ అధికారులు తమ పరిధిలోని కుడికాల్వ పవర్‌హౌస్ నుంచి విద్యుత్ సరఫరా చేశారు. డ్యామ్ నిర్వాహకులు కుడికాల్వ గేటు తాళాలు ఇవ్వకపోవడంతో ఐదో నంబరు గేటును పగలగొట్టి.. 2000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసుకున్నారు. గంటకు 1000 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదలను పెంచుతూ రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున పది రోజుల్లో 5 టీఎంసీల నీటిని కుడి కాల్వకు విడుదల చేయనున్నట్లు ఏపీ నీటి పారుదల శాఖ ఈఈ శ్రీహరి తెలిపారు.

### తీవ్ర విమర్శలు..

సీఎం కేసీఆర్ ఓటమి భయంతోనే సాగర్ డ్యాంపై ఏపీవైపు ఉద్రిక్తత సృష్టించి, తెలంగాణ సెంటిమెంట్‌ను వాడుకొని, ఓట్లు దండుకోవడం కోసం ప్రయత్నించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి కూడా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు మండిపడుతున్నారు. ఓటమిభయంతోనే బీఆర్ఎస్ పార్టీ ఇలా పోలింగ్ రోజు కుట్రలకు పాల్పడిందని.. ఏం ఆశించి ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారో కళ్లకు కట్టినట్లు కనిపిస్తోందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం వచ్చాక.. ఇతర రాష్ట్రాలతో ఉన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇక.. ఎన్నికల వేళ బీఆర్ఎస్, వైసీపీ తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఆడిన దొంగనాటకంలో భాగమే ఈ ఘటన అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శించారు. జరిగిన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఏపీ ప్రభుత్వ దుందుడుకు వైఖరిని ఆయన ఖండించారు. ఇక ఈ ఘటన.. తెలుగు ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు కేసీఆర్, జగన్, బీజేపీ కలిసి ఆడిన నాటకంగా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. మరోవైపు.. ఓడిపోతున్నామని తెలిసినందునే సీఎం కేసీఆర్ ఎన్నికల రోజే నాగార్జున సాగర్ నీటి గొడవను తెరపైకి తీసుకువచ్చి రాజకీయం చేస్తున్నారని బీజేపీ నేత బండి సంజయ్ ఆరోపించారు.

### కేంద్రానికి కృష్ణాబోర్డు నివేదిక

అర్ధరాత్రి వేళ జరిగిన ఈ హైడ్రామాతో తెలుగు రా ష్ట్రాల ప్రజలే కాక, కేఆర్ఎంబీ కూడా ఉలిక్కిపడింది. డ్యామ్ వద్ద పరిస్థితులపై శుక్రవారం కేంద్ర జలశక్తి శా ఖకు నివేదిక అందించాలని యోచిస్తోంది.

### అర్ధరాత్రి నీటి విడుదల ఆక్షేపణీయం

తెలంగాణలో ఎన్నికలకు కొన్ని గంటల ముందు.. ఏపీ పోలీసులు, అధికారులు నాగార్జున సాగర్ డ్యాంపైకి అర్ధరాత్రి సమయంలో చొచ్చుకొచ్చి.. నీటిని విడుదల చేసుకోవడం అక్రమం, ఆక్షేపణీయం అని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలా చేయడం ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని ఉల్లంఘించడమేనని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ధ్వజమెత్తారు. బోర్డులో చర్చించకుండా ఏపీ పోలీసులు మూకుమ్మడిగా అర్ధరాత్రి డ్యాం వద్దకు చేరుకుని సీసీ కెమెరాలు ధ్వంసం చేయడం, బారి కేడ్లు ఏర్పాటు చేయడం, నీటిని విడుదల చేసుకోవడం దుర్మార్గమని, ఈ దౌర్జన్యాన్ని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం తీవ్రంగా ఖండిస్తోందని.. గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వ తీరుపై తెలంగాణ ప్రభుత్వం, కృష్ణాబోర్డు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వేళ ఈ చర్యకు పాల్పడటం ఉభయ రాష్ట్రాల పాలకుల ఎత్తుగడగా ఉందని రైతు సంఘం అభిప్రాయ పడింది.

### కేసీఆర్ ఆరా.. నేడు సాగర్‌కు స్మితాసబర్వాల్

నాగార్జునసాగర్ డ్యామ్‌పై ఏపీ పోలీసుల దాడి.. బలవంతంగా నీటి విడుదల తదితర పరిణామాలపై సీఎం కేసీఆర్ ఆరా తీశారు. సాగర్ కుడికాలువ గేట్లను ఎత్తడానికి అవసరమైన విద్యుత్ సరఫరాను తెలంగాణ ప్రభుత్వం నెల రోజుల కిందటే తొలగించగా.. ఏపీ ప్రభుత్వం నెల రోజుల క్రితం ప్రత్యేకంగా లైను వేసిందని అధికారులు సీఎంకు నివేదించారు. సాగర్‌లో రాకపోకల నియంత్రణకు సంబంధించిన గేట్లను ఏపీ పోలీసులు ధ్వంసం చేశారని, డ్యామ్ దిగువన ఉన్న వాక్‌వే వంతెనను కూడా వారు స్వాధీనం చేసుకున్నారని నివే దించారు. దీంతో వాస్తవ పరిస్థితిని తెలుసుకోవడానికి వీలుగా నాగార్జునసాగర్‌ను సందర్శించాలని నీటిపారుదల శాఖ, సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్‌ను ఆదేశించారు. శుక్రవారం ఆమె సాగర్‌ను సందర్శించనున్నారు. మరోవైపు.. ఏపీ ఆక్రమణపై తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌కు తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) సి.మురళీధర్ గురువారం వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. డ్యామ్‌పై సీసీ కెమెరాలు, ఆటోమేటిక్ గేట్లను ధ్వంసం చేశారని.. వాటర్ రిలీజ్ ఆర్డర్ లేకున్నా అక్రమంగా నీటిని తరలిస్తున్నారని అందులో పేర్కొన్నారు. సీసీ కెమెరాలను, ఆటోమేటిక్ గేట్లను తక్షణం పునరుద్ధరించాలని.. ఏపీ యంత్రాంగం సాగర్ డ్యామ్‌ను ఖాళీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



అహ్మదాబాద్ నవంబర్ 30 : కెమికల్ ఫ్యాక్టరీలో పేలుడు జరిగింది. మంటల్లో కాలి ఏడుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. మరో 27 మంది కార్మికులకు కాలిన గాయాలయ్యాయి. గుజరాత్‌లోని సూరత్‌లో ఈ సంఘటన జరిగింది. ఏథర్ ఇండస్ట్రీస్‌లో బుధవారం తెల్లవారుజామున కెమికల్ స్టోరేజీ ట్యాంకులో మంటలు చెలరేగాయి. దీంతో భారీగా పేలుడు సంభవించింది. ప్రమాద సమయంలో ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు పదుల సంఖ్యలో గాయపడ్డారు. మరికొందరు అదృశ్యమయ్యారు.కాగా, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చిన తర్వాత అదృశ్యమైన కార్మికుల కోసం గురువారం వెతికారు. ఈ నేపథ్యంలో ఏడుగురు కార్మికులు కాలి బూడిదిగా మారినట్లు గుర్తించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ అగ్నిప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు, ఫైర్ అధికారులు తెలిపారు. గుజరాత్‌లోని అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తల్లో ఒకరు, 1.3 మిలియన్ డాలర్ల సంపద ఉన్న అశ్విన్ దేశాయ్‌కు చెందిన కంపెనీగా సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

## ఎన్నికల నిబంధనలు ఉల్లంగించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

### కేసు నమోదు చేసిన పోలీసులు

**యదార్థవాది, నిర్మల్, 30 నవంబరు :** ఎన్నికల నిబంధనలు అతిక్రమించారనే ఫిర్యాదుతో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇవాళ ఎల్లపెల్లిలో పార్టీ కండువా వేసుకుని ఇంద్రకరణ్ పోలింగ్ కేంద్రానికి వచ్చారు. కండువాతోనే ఓటు వేశారు. అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.ప్రతిపక్ష నేతలు ఆందోళన నిర్వహిం చారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఈనెల 28న ప్రచారం ముగిసింది. పార్టీ గుర్తులు కనిపించేలా చేయటం, ఫలనా గుర్తుకు ఓటు వేయాలని చెప్పటం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుంది. ఆ నిబంధనలు ఉల్లంఘించి పోలింగ్ కేంద్రానికి ఆయన సింబల్‌తో కూడిన పార్టీ కండువా వేసుకుని వెళ్లటం గమనార్హం. ఆయన తీరుపై ప్రతిపక్ష నేతలు మండిపడుతున్నారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న హిజ్రాలు

**యదార్థవాది, జగిత్యాల, 30 నవంబరు :**జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కును ట్రాన్స్ జెండర్స్ వినియోగించుకున్నారు.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవడం కనీస బాధ్యత అని సమర్థవంతమైన నాయకున్ని ఎన్నుకోవాలని తెలిపారు... ట్రాన్స్ జెండర్స్ ల సమస్యలు గత ప్రభుత్వాలకు తమ సమస్యలను విన్నవించుకున్న పరిష్కారం కాలేవని ఇప్పుడు వచ్చే నూతన ప్రభుత్వం పరిష్కరించాలని తెలిపారు.

## మంచిర్యాల, కొమురం భీం జిల్లాల్లో ముగిసిన పోలింగ్

**యదార్థవాది, అదిలాబాద్, 30 నవంబరు :** మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు మంచిర్యాల, కొమురం భీం జిల్లాల్లో పోలింగ్ గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు కావడంతో నాలుగు గంటల వరకే పోలింగ్ నిర్వహించారు. నిర్ణీత సమయంలోపు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న వారికి ఓటు వేసే అవకాశం ఇచ్చారు. ఐదు నియోజకవర్గాల్లో పోలింగ్ సమయం ముగిసినా... పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ కొనసాగింది. 4 గంటల తర్వాత పోలింగ్ కేంద్రానికి వచ్చేవారికి అనుమతి ఇవ్వలేదు.

## బీఅర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వివాదం

**యదార్థవాది, ఆసిఫాబాద్, 30 నవంబరు :** ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద బీఅర్ఎస్,కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రం వద్ద క్యూ లైన్ లో నిలబడి ఉన్న ఓటర్ల వద్ద కు బిఆర్ఎస్ శ్రేణులు ద్విచక్ర వాహనంపై వెళ్లి ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ద్విచక్ర వాహనంపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మీ ఫోటో అంటించిన స్టిక్కర్ ఉండడంతో ఆ ద్విచక్ర వాహనాన్ని లోపలికి ఎలా అనుమతించారని పోలీసులను ప్రశ్నించిన కాంగ్రెస్ నాయకులు దీంతో బిఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

## జగన్‌కు కమీషన్లపై ఉన్న శ్రద్ధ పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనపై లేదు

(మొదటి పేజీ తరువాయి భాగం)

అని లక్షలాది ఉద్యోగాలు కల్పించే ఫ్యాక్స్ కాన్, లులూ, అమర్ రాజా, జాకీ వంటి పరిశ్రమలు రాష్ట్రాన్ని వదిలి పరారయ్యాయన్నారు. టీడీపీ హయాంలో పరిశ్రమల ద్వారా యువతకు 6 లక్షల ఉద్యోగాలు కల్పించిందని వైసీపీ ప్రభుత్వమే అసెంబ్లీ సాక్షిగా అంగీకరించిందని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాళ్లరేవులోని నిరుద్యోగ యువకులకు స్థానిక కంపెనీలతో మాట్లాడి ఉద్యోగాలిచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. యువకులు ఉద్యోగాలు వచ్చేవరకు యువగళం నిధి కింద నెలకు రూ.3వేలు భృతి కల్పిస్తామన్నారు. చంద్రబాబు సారధ్యంలో రాబోయే 5 ఏళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమల ఏర్పాటుతో 20లక్షల ఉద్యోగాలిస్తామన్నారు. ప్రతిఏటా జాబ్ నోటిఫికేషన్ ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని లోకేష్ పేర్కొన్నారు.

ఎన్టీఆర్ కుటుంబసభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు. సెంటర్ పోలింగ్ బూత్‌లో స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ఓటేశారు. జూబ్లీహిల్స్ క్లబ్‌లో నటుడు సుమంత్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో కీరవాణి ఓటుహక్కు వినియోగించుకున్నారు. షేక్ పేటలో సినీ దర్శకుడు రాజమౌళి, ఫిల్మ్ నగర్ క్లబ్‌లో దర్శకుడు రాఘవేంద్రరావు, నటుడు రానా తమ ఓటేశారు. నాగార్జున, అమల, నాగచైతన్య... జూబ్లీహిల్స్ లోని ప్రభుత్వ వర్కింగ్ విమెన్ హాస్టల్ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.అలాగే మహేశ్ బాబు నమ్రత కూడా జూబ్లీహిల్స్‌లోని జూబ్లీ పబ్లిక్ స్కూల్‌లో ఓటు వేశారు. ప్రముఖ





సీనియర్ నటుడు బ్రహ్మానందం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా అంతా తమ విలువైన ఓటును వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.వైఎస్ఆర్‌టీపీ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ శర్మిల హైదరాబాద్‌లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.హాస్య నటుడు బ్రహ్మానందం అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. హైదరాబాద్‌లోని ఓ పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు.సినీ హీరో అల్లు అర్జున్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. జూబ్లీహిల్స్‌లోని ఓ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.జూబ్లీహిల్స్ క్లబ్‌లో భార్య సురేఖతో కలిసి మెగాస్టార్ చిరంజీవి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్ర యువత అంతా ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.మెదక్ జిల్లా సిద్దిపేట నియోజకవర్గంలో మంత్రి హరీశ్‌రావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన తన సతీమణి, కొడుకుతో కలిసి ఓటు వేశారు.

## ఈవీఎంల మొరాయింపుపై కాంగ్రెస్ కంప్లయింట్

**యదార్థవాది, హైదరాబాద్, 30 నవంబరు :** తెలంగాణ వ్యాప్తంగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ ముగిసింది. తొలి రెండు గంటల్లో పోలింగ్ నెమ్మదిగా జరిగింది. కొన్ని చోట్ల 12 గంటల తరువాత ఓటర్లు బయటకు వచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. అక్కడక్కడ స్వల్ప ఉద్రిక్తతలు మినహా రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా సాగుతోంది. పలుచోట్ల ఈవీఎంలు మొరాయిస్తున్నాయి. దీంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల ఓటు వేయడానికి కనీసం 10 సెకన్ల సమయం పడుతోందని ఓటర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారులకు, స్టేట్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ విషయంపై డీఈవోలతో సీఈవో వికాస్‌రాజ్ కోఆర్డీనేట్ అయ్యారు.రాష్ట్రంలో పలు చోట్ల ఈవీఎంల మొరాయింపుపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. సమస్యలను ప్రస్తావిస్తూ సీఈవో వికాస్‌రాజ్‌కు లేఖ రాసింది. ఈవీఎంలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరింది. లేని పక్షంలో పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సమయాన్ని పెంచాలని కాంగ్రెస్ పార్టీ నేతలు సీఈవోను కోరారు.

హైదరాబాద్‌లో మందకోడిగా పోలింగ్ కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేవలం 21 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఓటు హక్కు వినియోగించుకోవాడానికి హైదరాబాద్ ఓటర్లు ఆసక్తి చూపడం లేదు. మధ్యాహ్నం 3 గంటల వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 51.89 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. కాగా, సాయంత్రం పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది.

## జనవరి 1 నుంచి మరో ఐదేళ్లు

**యదార్థవాది, న్యూఢిల్లీ, 30 నవంబరు :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని పేద ప్రజలకు శుభవార్త చెప్పింది. 2024 జనవరి 1 నుంచి మరో 5 సంవత్సరాల పాటు 81 కోట్ల మంది అర్హులకు నెలకు ఒకరికి 5 కిలోల చొప్పున రేషన్ ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించింది. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద మరో ఐదేళ్లపాటు పేదలకు ఉచితంగా 5 కిలోల బియ్యం అందించనున్నట్లు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజనకు వచ్చే ఐదేళ్లలో రూ.11.8లక్షల కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ నిర్ణయాలను అనురాగ్ ఠాకూర్ మీడియాకు తెలిపారు.ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజనను కేంద్రం.. దేశంలో కోవిడ్ విజృంభించిన సమయంలో పేదలకు అండగా ఉండేందుకు 2020లో ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద అర్హులకు ఒకరికి 5కిలోల బియ్యాన్ని ఉచితంగా అందిస్తోంది. ఈ పథకం 2023 డిసెంబర్ 31తో గడువు ముగియగా.. కేంద్ర కేబినెట్తాజా నిర్ణయంతో మరో ఐదేళ్లపాటు కొనసాగనుంది.ఇక, కేంద్రం, రాష్ట్రాల మధ్య పన్ను రాబడిని పంచుకోవడంపై నిర్ణయం తీసుకునే 16వ ఆర్థిక సంఘం విధివిధానాలకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అనురాగ్ ఠాకూర్తెలిపారు. 16వ ఆర్థిక సంఘం తన నివేదికను 2025 అక్టోబర్ నాటికి సమర్పిస్తుందన్నారు. 2026 ఏప్రిల్ నుంచి ప్రారంభమయ్యే ఐదేళ్ల కాలానికి సిఫార్సులు చెల్లుబాటు అవుతాయని చెప్పారు. కాగా, డ్వాక్రా గ్రూపులకు వ్యవసాయ డ్రోన్‌లను అందించే పథకానికి కేంద్రం మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 15వేల డ్వాక్రా గ్రూపులకు డ్రోన్లు అందించి.. వారికి శిక్షణ ఇవ్వనుంది. వ్యవసాయ అవసరాల కోసం రైతులకు ఈ డ్రోన్లను డ్వాక్రా గ్రూపులు అద్దెకు ఇవ్వనున్నాయి. 2023-24 నుంచి 2025-2026 మధ్యకాలంలో ఎంపిక చేసిన 15,000 డ్వాక్రా గ్రూపులకు డ్రోన్లు అందించనున్నట్లు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ఇది ఇలావుండగా, కేంద్ర కేబినెట్ సమావేశం లో ఉత్తరాఖండ్ టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్ గురించి చర్చకు వచ్చిందని అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ఆ సమయంలో ప్రధాని మోడీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారని వెల్లడించారు. ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలో ఉన్నా కూడా.. సొరంగం వద్ద జరుగు తున్న రెస్క్యూ ఆపరేషన్ గురించి ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్సింగ్ ధామితో రోజుకు రెండు సార్లు మాట్లాడినట్లు మీడియా అడిగిన ప్రశ్నకు ఠాకుర్సమాధానమిచ్చారు. కాగా, కార్మికుల క్షేమంగా బయటికి రావడంతో మంగళవారం రాత్రి ఆనందం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. అంతేగాక, కార్మికులకు ఫోన్ చేసి మాట్లాడారు ఈ రెస్క్యూ ఆపరేషన్ ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురిచేసిందని చెప్పారు. టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల ధైర్యం, సహనం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి దాయకమన్నారు. వారంతా మంచి ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. చాలా రోజుల నిరీక్షణ తర్వాత వారంతా తమ కుటుంబ సభ్యులను కలుసుకోవడం గొప్ప సంతృప్తిని కలిగించిందని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. ఇలాంటి సవాళ్ల సమయంలో ఆయా కుటుంబాలు ప్రదర్శించిన ధైర్యం ప్రశంస నీయమన్నారు. రెస్క్యూ ఆపరేషన్‌లో ఎంతగానో శ్రమించిన సహాయక సిబ్బందికి సెల్యూట్ చేస్తున్నట్లు ప్రధాని మోడీ చెప్పారు. వారి ధైర్యం, సంకల్పమే కార్మిక సోదరులకు కొత్త జీవితాన్ని ప్రసాదించిందన్నారు. ఈ మిషన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ మానవత్వం, టీంవర్క్ కు అద్భుతమైన ఉదాహరణగా నిలిచారంటూ ప్రశంసించారు ప్రధాని మోడీ.

## విజయాన్ని శాసించనున్న స్వతంత్రులు

**యదార్థవాది, హైదరాబాద్, 30 నవంబరు :** ఎన్నికల్లో ఒక్క ఓటు మెజార్టీ వచ్చినా అభ్యర్థి గెలుపొందే అవకాశం ఉంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల నుంచి టిక్కెట్ పొందిన వారితో పాటు కాస్త జన బలమున్న నాయకులు స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల బరిలో నిలిచారు. పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేస్తున్నారు. 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో వెయ్యి, రెండు వేల ఓట్లతో తేడాతో గెలిచిన అభ్యర్థులూ ఉన్నారు. గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులకు పడిన ఓట్లను చూస్తుంటే పోటాపోటీగా ఎన్నికలు జరిగే, స్వల్ప మెజార్టీతో గెలుపొందే స్థానాల్లోని అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. మరోవైపు ప్రధాన పార్టీల గుర్తులను పోలిన గుర్తులున్న స్వతంత్ర అభ్యర్థులకు ఎక్కువ ఓట్లు పడితే విజయం చేజారే అవకాశం ఉందని అభ్యర్థుల గుండెల్లో గుబులు మొదలైంది.2018లో నల్లగొండ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల్లో 70 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో స్వతంత్ర అభ్యర్థుల సంఖ్య 33 మంది. వీరిలో వెయ్యికిపైగా ఓట్లు పడిన వారు పది మంది వరకు ఉన్నారు. గెలిచిన అభ్యర్థికి దక్కిన స్వల్ప మెజార్టీకి సమానంగా స్వతంత్రులు ఓట్లు పొందటం విశేషం. 500 ఓట్లు పొందిన వారు 15 మంది వరకు ఉన్నారు. వీరు పోటీలో ఉండటం వల్ల గెలుపోటములను కొంతమేర ప్రభావం చేసినట్లు తెలుస్తోంది. ఈసారి ప్రధాన పార్టీలను పోలిన గుర్తులను స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించినట్లు ఆయా పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. కొందరు ఓటర్లు పార్టీల గుర్తును గమనించక.. దాన్ని పోలిన గుర్తున్న స్వతంత్రులకు ఓటేసే అవకాశం ఉందని నాయకులు గుబులు చెందుతున్నారు. దీంతో స్వతంత్రులు ఊహించిన దానికంటే కొంత ఎక్కువగా ఓట్లు పడే అవకాశం ఉంది. 2018 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు బీఎస్పీ, సమాజ్‌వాది, బహుజన లెఫ్ట్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీల అభ్యర్థులు బరిలో నిలిచారు. హుజూర్నగర్ మినహా మిగతా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. స్వల్ప మెజారిటీతో రెండు నియోజకవర్గాల్లో గెలుపొందారు. ప్రధాన పార్టీలకు 40 వేలకుపైగా ఓట్లు నమోదు కాగా ఇతర చిన్న తరహా పార్టీల అభ్యర్థులకు మరో ఐదు వేల వరకు నమోదయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులందరికీ కలిపి నియోజకవర్గాల వారీగా 9 వేలకు పైనే ఓట్లు రావడం గమనార్హం. ఈ నెల 30న జరగనున్న ఎన్నికల్లో సూర్యాపేటలో తొమ్మిది మంది, హుజూర్నగర్ 13, కోదాడ 21, తుంగతుర్తిలో నలుగురు, మొత్తంగా 47 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీపడుతున్నారు. వీరు ఏ మేరకు గెలుపు ఓటములను ప్రభావం చూపుతారోనని ఆయా నియోజకవర్గాల్లో చర్చ సాగుతోంది.

ఇక తెలంగాణ వ్యాప్తంగా చూస్తే ఆదిలాబాద్, పటాన్‌చెరు, పెద్దపల్లి, కొల్లాపూర్, సిరిసిల్ల, మునుగోడుతోపాటు 15 నియోజకవర్గాల్లో స్వతంత్రులు పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యం లో ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థు ల్లో గుబులు మొదలైంది. సిరిసిల్లలో ఓడిపోకపోయినా కేటీఆర్ మెజారిటీని లగిశెట్టి శ్రీనివాస్ తగ్గిస్తారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. లగిశెట్టి పద్మశాలి సామాజికవర్గానికి చెందిన నేత కావడంతో ప్రభావం కచ్చితంగా ఉంటుందంటున్నారు. ఇలా మిగతా నియోజకవర్గాల్లో కూడా ఈసారి ఎవరి గెలుపోటములను శాసిస్తారో చూడాలి.



యదార్థవాది, సిద్దిపేట, 30 నవంబరు: మంత్రి హరీశ్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి సిద్దిపేటలో ఓటు వేశారు. భార్య శ్రీనిత, తనయుడు అర్చిస్ మాన్‌తో కలిసి వచ్చిన మంత్రి ఓటు వేసి.. ప్రజలంతా ఓటు వేయాలని పిలుపునిచ్చారు.మరోవైపు ఉదయం 11 గంటల వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 20.64 శాతం మేర పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో 30.65 శాతం పోలింగ్ నమోదుకాగా.. అత్యల్పంగా హైదరాబాద్‌లో 12.39 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు.

## జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- పటిష్ట బందోబస్తు మధ్య ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్ కి తరలింపు
- జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

యదార్థవాది, జగిత్యాల, 30 నవంబరు: జగిత్యాల జిల్లా లోని అన్ని నియోజక వర్గాల్లో గురువారం పోలింగ్ ప్రకియప్రశాంత వాతావరణంలో ముగిసిందని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు.. ఓటింగ్ లో పాల్గొన్న ప్రజలంతా కూడా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, జిల్లాలో ఏ ప్రాంతంలో కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ శాఖ ఇతర శాఖ సమన్వయంతో సమర్ధవంతంగా అధికారులు సిబ్బంది విధులు నిర్వహించారన్నారు. పోలింగ్ పూర్తయిన ప్రతి పోలింగ్ స్టేషన్ నుంచి ఓటింగ్ సామాగ్రి మొత్తం విఆర్కే స్ట్రాంగ్ రూమ్ కు తరలించి అక్కడ కేంద్ర బలగాలతో పటిస్ట భద్రతను ఏర్పాటు చేశామన్నారు.. అంతకుముందు ఎస్పీ జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

## ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్న యువత

యదార్థవాది, జగిత్యాల, 30 నవంబరు: జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎన్నికల్లో యువత తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉత్సాహన్ని కనబరిచారు.. భారీగా క్యూలైన్ లు ఉన్న క్యూలైన్ లో వేసి ఉండి యువతి ,యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.. ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం వారు సెల్ ఫోన్ ల్లో సెల్ఫీలు తీసుకొని సామాజిక మాధ్యమల్లో పోస్టులు చేసుకున్నారు..కొత్త ఓటర్లలో ఉత్సహం నింపిన ఓటు హక్కుజిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజక వర్గం కేంద్రంల్లో 18 సంవత్సరాల నిండిన యువతి, యువకులు ఆసక్తిగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.. గురువారం ఈ సందర్బంగా ఉదయం నుండి సంబంధిత నియోజక వర్గ పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్ లో ఉండి ఓటు హక్కును వినియోగించుకొని ఆనందంగా బయటకు వచ్చి సెల్ఫీలు దిగి సంబరాలు జరుపుకున్నారు.. కొత్తగా, మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకోవడం ఆనందంగా ఉన్నారు.

## ఈవీఎంల మొరాయింపు అధికారులలో టెన్షన్

యదార్థవాది, కొడంగల్, 30 నవంబరు: రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్న వేళ పలు చోట్ల ఈవీఎంల మొరాయింపు అధికారులను టెన్షన్ పెడుతోంది. తాజాగా కొడంగల్ యోజకవర్గంలో ఓ ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.వికారాబాద్ జిల్లా బొమ్రాస్ పేట మండలంలోని తుంకిమెట్ల 194 పోలింగ్ స్టేషన్లో అరగంటకుపైగా ఈవీఎం మొరాయిస్తోంది. దీంతో పోలింగ్ నిలిచిపోయింది. క్యూలైన్లో నిల్చోవడంపై పలువురు అసహనంగా ఉన్నారు. త్వరగా సమస్య పరిష్కరించి పోలింగ్ మళ్లీ ప్రారంభించాలని కోరుతున్నారు.

### ఆసిఫాబాద్‌లో సైతం..

అసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్ నంబర్ 189 లో రెండు గంటలుగా ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ నిలిచిపోయింది. అలాగే కాగజ్ నగర్ పోలింగ్ బూత్ నంబర్ 63లో కూడా సాంకేతిక సమస్యతో రెండు గంటలుగా ఈవీఎంలు మొరాయిస్తున్నాయి. దీంతో ఓటర్లు వెనుదిరుగుతున్నారు.

## ఓటు వేయడానికి లండన్ నుంచి వచ్చాడు

యదార్థవాది, భద్రాద్రి, 30 నవంబరు: ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఓటే వజ్రాయుధం. ఓటు విలువను గుర్తించిన ఓ యువకుడు తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు దేశాలను దాటి వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన యువకుడు ముళ్ళపూడి అరవింద్ లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్గా పనిచేస్తున్నాడు. ఈరోజు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఎలాగైనా ఓటు హక్కు వినియోగించుకోవాలని అరవింద్ లండన్ నుంచి ఇండియాకు చేరుకొని తన సొంత ఊరు అయిన అశ్వారావుపేటలో తన తొలి ఓటును వినియోగించుకున్నాడు. తల్లిదండ్రులు వద్దు అన్నప్పటికీ ఓటు విలువ తెలుసుకొని తల్లిదండ్రులను ఒప్పించి ఓటు వేసేందుకే ఇంత దూరం వచ్చినందుకు యువకుడిని పలువురు అభినందించారు. ప్రజల తలారాతను మార్చే ఓటును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని అరవింద్ ప్రజలను కోరారు.

ప్రజలు ఎక్కువ మంది ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారని జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. దీనిపై మేధావులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. అందరితో మాట్లాడిన తర్వాత కొత్త పార్టీపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జేడీ లక్ష్మీనారాయణ గత లోక్‌సభ ఎన్నికల్లో జనసేన పార్టీ తరుపున విశాఖ పార్లమెంటుకు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈసారి ఏ పార్టీలో చేరతారన్న ఉత్కంఠకు ఆయన తెరదించారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో జనసేన తరపున విశాఖ నుంచి పార్లమెంట్ కు పోటీ చేశారు. మూడో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత పవన్ కల్యాణ్ సినిమాలు చేస్తున్నరన్న కారణం చూపి ఆయన పార్టీకి రాజీనామా చేశారు. తర్వాత స్వచ్ఛంద సంస్థ పెట్టుకుని వ్యవసాయ అంశాలపై పని చేస్తున్నారు. విశాఖలోనే మళ్లీ పోటీ చేయాలని నిర్ణయించుకున్న ఆయన పలు అంశాలపై స్పందిస్తున్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేసు వేసి పోరాడుతు న్నారు. అయితే ఆయన అన్నిపార్టీలనూ పొగుడుతూండటంతో ఎప్పటికప్పుడు ఆయన ఫలానా పార్టీలో చేరబోతున్నారన్న ప్రచారం జరుగుతూ వస్తోంది. విశాఖలో జేడీ ఫౌండేషన్, నిపుణ హ్యూమన్ డెవలప్మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 2న విశాఖలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్ ఫేర్‌లో 50కు పైగా కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. తాను కొత్త పార్టీ పెట్టి ఆ పార్టీ తరుపునే విశాఖ పార్లమెంటు నుంచి పోటీ చేయడానికి ఆయన సిద్ధమవు తున్నారని సమాచారం. బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతారని ఏపీ అధ్యక్ష పదవి తీసుకుంటారని ప్రచారం జరిగింది. టీడీపీలో చేరే విషయంపై ఎప్పుడూ రూమర్స్ రాలేదు కానీ మళ్లీ జనసేనలో చేరుతారన్న చర్చ అయితే జరిగింది. కానీ పవన్ ఆయనను ఆహ్వానించలేదు... ఆయన కూడా పవన్ ను పార్టీలోకి వస్తానని అడగలేదు. ఈ కారణంగా పెండింగ్ పడిపోయింది. చివరిగా ఆయన సొంత పార్టీ ఆలోచన చేస్తున్నారు.

## ముచ్చెమటలు పుట్టించిన కమలం...

**యదార్థవాది, కరీంనగర్, 30 నవంబరు :** గెలుపుపై అన్ని పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా తెలంగాణ ఎన్నికల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బిజెపిల మధ్య ట్రయాంగిల్ ఫైట్ నడుస్తోంది. దీంతో ఓటరు నాడీ పట్టుకోవడం కష్టతరంగా మారుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ల మధ్య పోటీ ఉండగా.. పట్టణ, నగర ప్రాంతాల్లో బిజెపి సైతం గట్టి పోటీ ఇస్తోంది. దీంతో గెలుపోటముల అంచనా వేయడానికి వీలు లేకుండా పోతుంది. అయితే ఇప్పుడు బిజెపి ఆ రెండు పార్టీలకు ధీటుగా మారింది. తాను గెలవకపోయినా.. ప్రత్యర్థి పార్టీల గెలుపోవటములను నిర్దేశించే స్థాయికి చేరుకోవడం విశేషం. ఒకానొక దశలో అధికార బీఆర్‌ఎస్ కు ప్రత్యామ్నాయం భారతీయ జనతా పార్టీ అని విశ్లేషణలు సైతం ప్రారంభమయ్యాయి. కానీ అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ పుంజు కుంది. భారతీయ జనతా పార్టీ వెనుకబడిపోయింది. కానీ ఎన్నికల పోలింగ్ సమీపించేసరికి బిజెపి దూకుడు కనబరిచింది. ప్రచారంలో హోరెత్తించింది. ఇది బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలో కలవరానికి కారణమైంది. బిజెపి తమ ఓట్లను ఎక్కడ చీల్చుతుందోనన్న బెంగ ఆ రెండు పార్టీలను వెంటాడుతోంది.తెలంగాణలో 119 నియోజక వర్గాలు ఉన్నాయి. ఇందులో ట్రయాంగిల్ ఫైట్ లో పదివేల మెజారిటీ లోపు ఓట్లతోనే గెలుపొందే నియోజకవర్గాలు 70 వరకు ఉన్నాయి. 5000 ఓట్లు లోపు మెజారిటీతో గెలిచే నియోజకవర్గాలు 50 వరకు ఉన్నాయి. అయితే ఈ నియోజకవర్గాల్లో భారతీయ జనతా పార్టీకి ఓట్లు ఎన్ని? చీల్చే ఓట్లు ఎన్ని? అన్నదానిపై మిగతా రెండు పార్టీల గెలుపోటములు ఆధారపడి ఉన్నాయి. అదే సమయంలో పట్టణాలు, నగరాల్లో బిజెపి బలమైన శక్తిగా ఉంది. అక్కడ కాంగ్రెస్, బీ ఆర్‌ఎస్ కు లభించే ఓట్లు బట్టి.. బిజెపి విజయం ఆధారపడి ఉంది. ఇలా ఎలా చూసుకున్నా తెలంగాణ ఎన్నికల్లో ఇప్పుడు బీజేపీ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా మారింది. ఆ పార్టీ మిగతా పార్టీలకు ప్రమాదకారిగా మారింది. తరువాత సార్వత్రిక ఎన్నికల్లో నాలుగు ఎంపీ స్థానాలను గెలుపొందింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గణనీయమైన సీట్లు సొంతం చేసుకుంది. తెలంగాణలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో.. కొన్ని నిర్ణయాలతో బిజెపి వెనుక బడింది. కర్ణాటక ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన జోష్ నెలకొంది. తెలంగాణ ప్రజల్లో సైతం చేంజ్ కనిపిస్తోంది. సరిగ్గా ఇటువంటి పరిస్థితుల్లో బిజెపి నిర్ణయాత్మక శక్తిగా మారింది. ఆ రెండు పార్టీలతో పోల్చుకుంటే సీట్ల పరంగా మెజారిటీ దక్కకపోయినా.. ఓట్ల పరంగా ఆ రెండింటికి ముచ్చెమటలు పట్టించడం విశేషం.

## కోట్లు కురిపించిన ఎన్నికలు

**యదార్థవాది, హైదరాబాద్, 30 నవంబరు :** తెలంగాణ ఎన్నికల ప్రచారంలో డిజిటల్ మీడియాను భారీగా వాడుకున్నారు. ప్రతి ఒక్క అభ్యర్థి సోషల్ మీడియాతో ప్రజల్లోకి వెళ్లారు. అంతో కాకుండా ఫేస్ బుక్, గూగుల్ కూడా పార్టీలు భారీగా ప్రకటనలు ఇచ్చాయి. వందల కోట్ల రూపాయలను ప్రకటనల కోసమే ఉపయో గించాయి. దీంతో గూగుల్, ఫేస్ బుక్ పై కాసుల వర్షం కురిసింది. దేశ వ్యాప్తంగా ఐదు రాష్ట్రాల ఎన్నికలతోపాటు.. ఈ ఏడాది రాజకీయ పార్టీలు గూగుల్, ఫేస్ బుక్ లకు అక్షరాల 450 కోట్ల రూపాయల యాడ్స్ వచ్చినట్లు చెబుతున్నారు. నవంబర్ 1వ తేదీ నుంచి నవంబర్ 28వ తేదీ ప్రచారం ముగిసేంత వరకు.. అధికారికంగా.. నేరుగా గూగుల్, ఫేస్ బుక్ లకు అన్ని పార్టీలు కలిపి 25 కోట్ల రూపాయల యాడ్స్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో గూగుల్ వాటా 20 కోట్లుగా ఉంటే.. ఫేస్ బుక్ వాటా 5 కోట్ల రూపాయలుగా ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. అంతేందుకు గతంలో జరిగిన జీహెచ్ఎంసీ, దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఎన్నికల్లోనూ 5 కోట్ల రూపాయలపైనే అన్ని పార్టీలు యాడ్స్ ఇచ్చిన సంగతి తెలిసిందే. పార్టీల వారీగా చూస్తే గూగుల్, ఫేస్ బుక్ లకు బీఆర్‌ఎస్ ఎక్కువగా యాడ్స్ ఇచ్చి మొదటి స్థానంలో నిలవగా.. కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ మూడో స్థానంలో నిలిచింది. బీజేపీ తెలంగాణలోనే కాకుండా జాతీయ స్థాయిలో యాడ్స్ ఇచ్చింది. ఈ ఎన్నికల్లో అన్ని పార్టీలు కలిపి 52 స్లాట్స్ లో ప్రకటనలు ఇచ్చాయి. నవంబర్ లో గూగుల్, ఫేస్ బుక్ తెలుగు రాష్ట్రాల్లో నడిపే యాడ్ స్లాట్స్ లో 57 శాతం పార్టీలు ప్రకటనల కోసం బుక్ చేసుకున్నాయి. వీడియో, ఇమేజ్‌లతోపాటు వెబ్ సైట్స్, ఫేస్ బుక్ పేజీలు స్పాన్సర్డులు ఉన్నాయి. ఈ ప్రకటనల కోసం రాజకీయ పార్టీలు రూ.25 కోట్లు ఖర్చు చేశాయి. ఇటు టీవీ ఛానళ్లల్లో కూడా భారీగా ప్రకటనలు ఇచ్చాయి. మొన్న జరిగిన వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ కు కూడా పార్టీలు స్టార్ టీవీ, హట్ స్టార్ లో ప్రకటనలు ఇచ్చాయి. న్యూస్ ఛానళ్లతో పాటు ఎంటర్ టైన్ మెంట్ ఛానళ్లలో కూడా ప్రకటనలు ఇచ్చారు.

లో భార్యతో కలిసి ఓటు వేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం 7 గంటలకు మొదలైంది. దీంతో ప్రజలు, సినీ రాజకీయ ప్రముఖులు ఓటు వేసేందుకు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఈ నేపథ్యంలోనే భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మంత్రి కేటీఆర్ తన ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. బంజారాహిల్స్ నందినగర్ లో గల ఓ పోలింగ్ బూత్‌లో భార్యతో కలిసి ఓటు వేశారు.అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేవాళ్లకే ఓటు వేశానని తెలిపారు. 'తెలంగాణ పౌరుడిగా ఓటు హక్కు వినియోగించుకుని నా బాధ్యత నెరవేర్చా. అభివృద్ధి కోసం పాటు



పడే పార్టీకి, ఒక మంచి నాయకుడికి ఓటు వేశా. తెలంగాణలో ఓటు ఉన్న పౌరులంతా ముందుకొచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి. ముఖ్యంగా పట్టణ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి ఓటు వేయండి. ఓటు వేసి మీ హక్కును కాపాడుకోండి' అంటూ కేటీఆర్ పిలుపునిచ్చారు.

# రంగంలోకి బెట్టింగ్ రాయుళ్లు

**యదార్థవాది, హైదరాబాద్, 30 నవంబరు :** పోటీ ఏదైనా బెట్టింగ్ ఖాయం అన్నట్లుగా ప్రస్తుత పరిస్థిత మారిపోయింది. తెలంగాణ ఎన్నికలపైనా అదే విధమైన బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. క్రికెట్, ఇతరత్రా పోటీలపై బెట్టింగులు నిర్వహించిన ఆన్లైన్ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లు.. ఇప్పుడు ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై వాటి కన్ను పడింది. తెలంగాణ ఎన్నికల ఫలితాలపై బరిలోకి దిగిన పందెం రాయుళ్లు కాయ్ రాజా కాయ్ అంటూ జోరుగా బెట్టింగ్స్ కాస్తున్నారు. ఈసారి ఫలానా పార్టీ అధికారంలోకి రాబోతోందని, ఫలానా నియోజకవర్గంలో ఫలానా అభ్యర్థి గెలవబో తున్నారంటూ భారీగా పందాలు వేస్తున్నారు. వందకు వెయ్యి, వెయ్యికి లక్ష అంటూ బెట్టింగ్ బంగార్రాజులు పందేలు కాస్తున్నారు. పెద్ద లీడర్లు తలపడుతున్న నియోజకవర్గాల్లో ఎవరికి ఎంత మెజార్టీ వస్తుందన్న పందేలు కూడా కాస్తున్నారు. లక్షలు కాదు.. కోట్లలో బెట్టింగ్స్ జరుగుతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. తెలంగాణలో ఏ పార్టీ గెలుస్తుంది. ఎవరు అధికారంలోకి రాబోతున్నారు. రాష్ట్రంలో ఎవరిని చూసినా ఇదే చర్చ. ఊరు వాడా, పల్లె పట్నం అని తేడా లేకుండా ప్రతి గల్లీలోనూ ఏ నలుగురు గుమిగూడినా ఇదే చర్చ. తెలంగాణతో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మిజోరాం రాష్ట్రాల్లో ఏ పార్టీ, ఎన్ని సీట్లు సాధిస్తుందనే అంచనాలపై వేర్వేరు బెట్టింగ్ సంస్థలు పందేలు నిర్వహిస్తున్నాయి. ప్రముఖులు ప్రచార కర్తలుగా ఆయా సంస్థల వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లకు విస్తృత ప్రచారం కల్పిస్తుండటం, వెబ్‌సైట్లు, బస్టాపులు, ఆటోలపై వారి ప్రకటనలు ప్రదర్శిస్తున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీలు ఎన్ని స్థానాల్లో గెలుస్తాయి.. ఎన్ని సీట్లతో సరిపెట్టుకుం టాయి. అంటూ ఆన్‌లైన్ బెట్టింగ్ సంస్థలు ప్రకటనలు ప్రదర్శిస్తు న్నాయి. డిసెంబరు 3వ తేదీన ఎన్నికల ఫలితాలు వెల్లడవుతా యని.. పందెంలో గెలిచిన వారు అంతకంత డబ్బు సంపాదించు కోవచ్చని ఊరిస్తున్నాయి. ఎన్నికల్లో గెలిచేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిత్యం రకరకాల ప్రచార కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు. అలాగే బెట్టింగ్ సంస్థలు అంతకు మించి హడావుడి పెంచాయి. తెలంగాణలోనే కాదు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సర్వేలు చేయించి మరీ పందాలు కాస్తున్నారు బుకీలు. కేసీఆరే సీఎం అవుతారని.. హంగ్ వస్తుందని.. కాంగ్రెస్ గెలుస్తుం దంటూ కోట్లాది రూపాయల్లో బెట్టింగులు కాస్తున్నారు. బీఆర్‌ఎస్.. కాంగ్రెస్ పార్టీకి ఎన్ని స్థానాలు వస్తాయనే దాని పైన కూడా పందాలు జరుగుతున్నాయి. రేవంత్ రెడ్డి రెండు చోట్ల గెలుస్తా డా... కేసీఆర్ కు ఎంత మెజార్టీ వస్తుంది.. కోమటిరెడ్డి బ్రదర్స్, మైనంపల్లి గెలుస్తారా లేదా అన్న అంశాలపైనా బెటటంగ్ జరుగుతోంది. మూడో తేదీ లోపు వేల కోట్ల బెట్టింగ్ జరిగే అవకాశం ఉందని అంచనా .

# బ్యాలెట్లలో భవితవ్యం

### ముగిసిన పోలింగ్

**యదార్థవాది, హైదరాబాద్, 30 నవంబరు :** తెలంగాణలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఓటర్లు తమ నిర్ణయాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేస్తున్నారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరాం ఎన్నికలు ముగిశాయి. తెలంగాణ ఎన్నికలు జరుగుతున్నాయి. డిసెంబర్ 3న ఐదు రాష్ట్రాల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఫలితాలే వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం చూపుతాయి. తెలంగాణలో ఓటింగ్ ముగిసిన తర్వాత సాయంత్రంలోగా వెలువడే ఎగ్జిట్ పోల్ అంచనాలపైనే అందరి దృష్టి ఉంటుంది.అధికార భారత రాష్ట్ర సమితిని గద్దె దించేందుకు విపక్ష కాంగ్రెస్, బీజేపీ తీవ్రంగా శ్రమిస్తున్నాయి. కాంగ్రెస్ అయితే బీఆర్‌ఎస్‌తో ఢీ అంటే ఢీ అన్నట్లుగా ప్రచారం నిర్వహించింది. ఇక చివరకు ప్రచారంలో బీజేపీ కూడా జోరు పెంచింది. వరుసగా మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తుండగా, రాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ గట్టిపోటీనిస్తోంది. మరోవైపు రాష్ట్రంలో తన ఉనికిని చాటుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ ప్రచారం ప్రధానంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని అవినీతిని లక్ష్యంగా చేసుకుంది. ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లింది. ఇక బీజేపీ 'డబుల్ ఇంజన్ ప్రభుత్వం' పేరుతో ప్రచారం చేసింది. కుటుంబ రాజకీయాలతో గులాబీ పార్టీపై ఎదురు దాడి చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రచార సమయంలో అనేక సమావేశాలలో ప్రసంగించారు, భారీ అభిమానుల మధ్య సోమ వారం హైదరాబాద్‌లో రోడ్‌షో నిర్వహించడంతోపాటు, కేసీఆర్ 96 ఎన్నికల సభలు నిర్వహించారు. ప్రధాని మోదీతో పాటు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా సహా పలువురు కేంద్రమం త్రులతోపాటు కాంగ్రెస్ నేతలు మల్లికర్జున ఖర్గే, రాహుల్ గాంధీ తమ తమ పార్టీ అభ్యర్థుల కోసం ఓట్ల కోసం ప్రచారం చేశారు. తెలంగాణలో త్రిముఖ పోటీ ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీజేపీలు కొన్ని మిత్రపక్షాలను కూడా చేర్చుకున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 119 స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను నిలబెట్టింది. సీట్ల పంపకాల ఒప్పందం ప్రకారం బీజేపీ 111, జనసేన 8 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ తన మిత్రపక్షమైన సీపీఎంకు ఒక సీటు ఇచ్చింది. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం హైదరా బాద్‌లోని తొమ్మిది సెగ్మెంట్లలో అభ్యర్థులను నిలబెట్టింది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో హోరీహోరీ పోరు జరిగింది. త్రిముఖ పోరు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో ఓటరు నాడి మాత్రం ఇప్పటి వరకు ఎవరికీ చిక్కలేదు. సర్వే సంస్థలు కూడా స్పష్టంగా ఫలితాలు వెల్లడించలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఓటరు తీర్పు ఎటు ఉంటుందో అన్న ఆసక్తి, ఆందోళన మూడు ప్రధాన పార్టీల్లో కనిపిస్తోంది.

# బిగ్ బాస్ శివాజీకి అమరావతి లింక్

**యదార్థవాది, విజయవాడ, 30 నవంబరు :** బిగ్ బాస్ సీజన్ 7లో ఫైనల్స్ దగ్గర పడుతున్నాయి. దీంతో హౌజ్‌లో కంటెస్టెంట్స్ ఎంత అలర్ట్‌గా ఉంటారో.. బయట వారికి ఓటు వేసేవారు కూడా అంతే అలర్ట్‌గా ఉండాలి. బిగ్ బాస్ ప్రేక్షకులు వేసే ఓట్లు.. కంటెస్టెంట్స్‌ను నామినేషన్స్ నుంచి తప్పించడానికి ఎంత ఉపయోగపడతాయో.. వారిని ఫైనల్స్ తీసుకెళ్లడానికి కూడా అంతే ఉపయోగపడతాయి. అందుకే బయట ఉన్న శివాజీ టీమ్ అలర్ట్ అయ్యారు. మామూలుగా తమ కంటెస్టెంట్‌ను సపోర్ట్ చేయడం, వారు ఏం చేసినా కరెక్ట్ అని చెప్పడం, ఓట్లు వేయమని అడగడం మాత్రమే పీఆర్ టీమ్స్ లక్ష్యం. కానీ శివాజీ టీమ్ మాత్రం దీనికి మరింత కొత్తదనాన్ని యాడ్ చేసింది.బిగ్ బాస్ సీజన్ 7 ప్రారంభమయినప్పటి నుంచే శివాజీ మీద ప్రేక్షకుల్లో పాజిటివ్ అభిప్రాయం ఏర్పడింది. మిగతావారంతా తమకు ఇచ్చిన టాస్క్‌ను రూల్ బుక్ ప్రకారం ఆడితే.. శివాజీ మాత్రం అందులో కొత్తద నాన్ని వెతికి ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసేవారు. దీంతో బిగ్ బాస్ ప్రేక్షకుల్లో ఆయనకు సపోర్ట్ బాగా పెరిగిపోయింది. సీజన్ మొదలయిన కొన్ని వారాల తర్వాత శివాజీలాంటి ఆటతీరు ఎవరూ కనబరచకపోవడంతో ఆయనే విన్నర్ అని కూడా చాలామంది ఫిక్స్ అయిపోయారు. కానీ ఇంతలోనే పల్లవి ప్రశాంత్, యావర్‌లతో సావాసం.. ఆయనకు హౌజ్‌లోనే కాదు.. బయట కూడా నెగిటివిటీ తెచ్చిపెట్టింది. శివాజీ ఆడే ప్రతీ ఆటలో వారికి ఫేవర్ చేస్తున్నట్టుగానే అనిపించేది. గత కొన్నివారాలుగా ఆయన ప్రవర్తన లో చాలా మార్పులు వచ్చాయి. దీంతో ప్రేక్షకుల్లో నెగిటివిటీ మరింత పెరిగిపోయింది.బిగ్ బాస్ హౌజ్‌లో ఎవరూ పర్ఫెక్ట్ కాదు. అందరూ తమ తమ గేమ్ ప్లాన్ ప్రకారం ముందుకు వెళ్తుంటారు. ఒకవేళ తమ గేమ్ వేరేవాళ్లకు నచ్చకపోయినా.. లేదా వారి ప్రవర్తనలో ఏమైనా లోపాలు ఉన్నా.. ఇతర కంటెస్టెంట్స్ చెప్తారు. శివాజీ కూడా ఇతర కంటెస్టెంట్స్‌లో ఉన్న లోపాలను అలాగే చెప్పే ప్రయత్నం చేశారు. కానీ ఆయన చెప్పే పద్ధతి చాలామందికి నచ్చలేదు. నేనేం చేసినా కరెక్టే, నాకు చెప్పేంతవారు ఎవరూ లేరు అనే మనస్తత్వం శివాజీలో పెరిగిపోయిందనేది కొందరు ప్రేక్షకుల అభిప్రాయం. ఇతరులలో తప్పులు వెతికి చెప్పడం, తానేం చేసినా కరెక్ట్ అనుకోవడం ప్రేక్షకులకు నచ్చడం లేదు. అందుకే గత రెండు వారాల్లో ఆయన ఓటింగ్ శాతం కూడా చాలా తగ్గిపోయింది. దీంతో శివాజీ పీఆర్ టీమ్ అలర్ట్ అయ్యింది.

'బిగ్ బాస్ షో చూస్తున్న, చూడకపోయినా ఈ నెంబర్(శివాజీ 'బిగ్ బాస్' ఓటింగ్ నెంబర్)కు మిస్డ్ కాల్ ఇవ్వండి. ఎందుకంటే నిరంతరం అమరావతి రైతులకోసం, ఆంధ్రప్రదేశ్ కోసం శ్రమించిన శివాజీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది" అంటూ వాట్సాప్, సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతుంది. శివాజీకి ఓటు వేసే నెంబర్‌ను అందరికీ ఫార్వర్డ్ చేస్తోంది ఆయన టీమ్. బిగ్ బాస్‌లాంటి షోలో గెలవడానికి ఓట్లు వేయించుకోవడం కోసం రాజకీయాలను మధ్యలోకి లాగుతున్నారని చాలామంది ప్రేక్షకులు ఫీలవుతున్నారు. పైగా ఆయనకు రాజకీయపరంగా సపోర్ట్ ఉండడం కూడా పెద్ద ప్లస్ అవుతుందని అనుకుంటున్నారు. ఈ మెసేజ్‌ను బట్టి చూస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బిగ్ బాస్ ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుని శివాజీని గెలిపించే ప్రయత్నం జరుగుతోందని అర్థం చేసుకోవచ్చు.

అప్పట్లో ఏపీ రాజకీయాల్లో 'ఆపరేషన్ గరుడ' అంటూ సంచలనం సృష్టించిన శివాజీపై తెలుగు దేశం పార్టీ సపోర్టర్‌గా ముద్రపడింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో కొన్ని పార్టీలతో కలిసి కుట్రలు చేస్తుందని అప్పట్లో ఆరోపించాడు. టీడీపీ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలు జరుగుతున్నాయని చెప్పాడు. ఆ తర్వాత ఒక ఛానల్ కు సంబంధించిన కేసులో అజ్ఞాతంలోకి వెళ్ళిన ఆయన చాలా రోజులు బయటకు రాలేదు. సినిమాలకు కూడా దూరమయ్యాడు. అయితే 2021, నవంబరు నెలలో అమరావతి రైతులు నిర్వహించిన మహా పాదయాత్రలో శివాజీ ప్రత్యక్షమయ్యాడు. వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేశాడు. ఏపీకి అన్యాయం జరుగుతోందని వాపోయాడు. రాజకీయాలన్నీ కులాల చుట్టూనే తిరుగుతున్నాయని, ఇలాగైతే ఏపీ భవిష్యత్తు అంధకారమేనని శివాజీ అన్నాడు. అప్పట్లో ఆయన వ్యాఖ్యలు పెద్ద దుమారమే రేపాయి. ఆ తర్వాత మళ్లీ శివాజీ మళ్లీ కనిపించలేదు.



**యదార్థవాది, నాగార్జున సాగర్, 30 నవంబరు :** తెలంగాణలో రాష్ట్రంలో ఎన్నికల జరుగుతున్నరోజు నాగార్జున సాగర్ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. కుడి కాలువనుంచి నీరు విడుదల చేయడానికి ఏపీ అధికారులు, పోలీసులు సాగర్ దగ్గరకు చేరుకున్నారు. ప్రాజెక్టుకు ఉన్న 26 గేట్లలో సగభాగమైన 13వ గేట్ వరకు తమ పరిధిలోకి వస్తుందని చెబుతూ 500 మంది పోలీసులతో కలిసి వచ్చిన ఆ శాఖ ఉన్నతాధికారులు తమను అడ్డుకున్న డ్యామ్ సిబ్బందిపై దాడిచేశారు. వారి మొబైల్ ఫోన్లతోపాటు అక్కడి సీసీటీవీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం 13వ గేట్ వరకు ముళ్లకంచె ఏర్పాటు చేసి డ్యామ్ను తమ అధీనంలోకి తీసుకున్నారు. నాగార్జున సాగర్ గొడవపై తెలంగాణ ఎన్నికల కమిషనర్ వికాస్ రాజ్ రాజకీయ నేతలకు కీలక సూచన చేశారు. ఈ గొడవ విషయం పోలీసులకు వదిలివేయాలని, వాళ్లే చూసుకుంటారని చెప్పారు. ఏ పార్టీకి చెందిన నేతలైనా సరే దీనిపై ఎవరూ ఏమీ మాట్లాడవద్దని హెచ్చరించారు.

## ఇబ్రహీంపట్నంలో లాఠీ చార్జ్

**యదార్థవాది, రంగారెడ్డి, 30 నవంబరు :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజవర్గంలో,105 సెంటర్ లో మాక్ పోలిం గ్ ప్రారంభం కాకపోవడంతో ఏజెంట్ల ల లో సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. ఉదయం 8:30 వరకు ఈవీఎంలు పని చేయలేదు. దీంతో క్యూలో ఉన్న ఓటర్లు, ఆందోళన చేశారు. పోలింగ్ సెంటర్ వద్ద సమీపంలో, కాంగ్రెస్ బిఆర్‌ఎస్, కార్యకర్తలు గుమ్మి గుట్టడంతో, పార్టీ గుర్తులు చూపిస్తూ ప్రచారం చేసే క్రమంలో, పోలీసులు లాఠీచార్జ్ చేశారు, ఘటన స్థలం నుండి, దూరంగా వెళ్లిపోయారు, అధికార పార్టీ వాళ్ళని మాత్రం వదిలిపెట్టి మాపై లాఠీ చార్జ చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఓటు హక్కును బహిష్కరించిన గిరిజనులు

### డబ్బులు ఇవ్వడంలేదని ఓటర్ల ఆందోళన

**యదార్థవాది, భద్రాద్రి/సూర్యాపేట, 30 నవంబరు :** ఏన్కూర్ మండలం కొత్త మేడేపల్లి గ్రామంలో రహదారులు త్రాగునీటి సౌకర్యం మౌలిక వసతులు ఏర్పాటు చేయలేదని ఆదివాసి గిరిజనులు నిరసనకు దిగారు. తమ సమస్య పరిష్కరిం చేంతవరకు ఓటు వేయమని తెగేసి చెప్పారు. మరోవైపు డబ్బులు ఇవ్వడంలేదని ఓటర్లు ఆందోళనకు దిగారు. పోలింగ్ నేపథ్యంలో సూర్యాపేట-జమ్మిగడ్డలో కొందరు ఓటర్లు ఆందోళన చేపట్టారు. తమను ఎవరూ పట్టించుకోవడం లేదని, డబ్బులు ఇవ్వడం లేదని నిరసనకు దిగారు. పక్క వీధుల్లో ఓటర్ల కోసం డబ్బులు ఇస్తుంటే తమ వీధుల్లో పార్టీల నాయకులు మనీ పంచడం లేదని వాపోయారు. 'మా ఓట్లు పార్టీలకు అవసరం లేదా?' అంటూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు.

## కామారెడ్డిలో హై డ్రామా

**యదార్థవాది, కామారెడ్డి, 30 నవంబరు :** కామారెడ్డి కేంద్రంలోని బాయ్స్ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బిఆర్ ఎస్ నేతల మధ్య వాగ్వాదం తీవ్ర స్థాయిలో కొనసాగింది. అక్కడికి ఇరు పార్టీల కార్యకర్తలు భారిగా చేరుకున్నారు. ఇరుపక్షాల వారిని పోలీసులు చెదరగొట్టారు.

## జనగామలో లాఠీ చార్జ

**యదార్థవాది, జనగామ, 30 నవంబరు :** జనగామ పట్టణంలోని ,245, 246 పోలింగ్ కేంద్రాల దగ్గర బిఆర్‌ఎస్, కాంగ్రెస్, సిపిఐ ,బిజెపి పార్టీల, మధ్య ఘర్షణ జరగడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలని చెదరగొట్టడానికి లాటి చార్జ్ చేసారు. పోలింగ్ కేంద్రంలోకి సంబంధం లేని వాళు ళ వస్తున్నారంటూ కాంగ్రెస్ బిజెపి, సిపిఎం ,పార్టీ నాయకుల ఆరోపణ. ఈ నేపథ్యంలో బిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తను ఇతర పార్టీల కార్యకర్తలు నేతలు చితక్కొట్టారు.

## బీఆర్‌ఎస్ నేతలు దౌర్జన్యం చేస్తున్నారు

**యదార్థవాది, రాజన్న సిరిసిల్ల, 30 నవంబరు :** నా అభివృద్ధిని చూసి ఓటేస్తారు అన్న కేటీఆర్ ఈరోజు సిరిసిల్లలో డబ్బు మద్యం పంచుతూ తన నాయకులతో దౌర్జన్యం చేస్తు డబ్బులు పంచుతున్న వీడియోలను సిరిసిల్ల శాసనసభ అభ్యర్థి రాణి రుద్రమ మీడియా ముందు పెట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల బిజెపి అభ్యర్థిగా పోటీలో ఉన్న రాణి రుద్రమ ఈరోజు సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించారు. ఇందులో భాగంగా టిఆర్‌ఎస్ సంబంధించినటువంటి నాయకులు కార్యకర్తలు ఓటర్లను మభ్యపెడుతూ భయభ్రాం తులకు గురి చేస్తూ దౌర్జన్యంగా డబ్బులు పంచుతున్నారని.. అసలు నా అభివృద్ధిని చూసి ఓటేస్తా అన్న కేటీఆర్ ఈరోజు డబ్బులు, మద్యం పంచడాన్ని తన పార్టీలో ప్రోత్సహిస్తున్నారని,ఓటమి భయంతోనే కేటీఆర్ తన నియోజకవర్గంలో డబ్బులను పంచుతున్నారని.. గమనించిన బిజెపి కార్యకర్తలను చూసి వాళ్ళు పారిపోయారని తెలిపారు.

# సెలబ్రిటీల జోరు.. మన స్టార్స్ ఓట్లు ఎక్కడెక్కడంటే..








ఇక సెలబ్రిటీల ఓట్లు వేస్తూ మీడియా ద్వారా ప్రజలకి కూడా ఓట్లు వేయమని పిలుపునిస్తారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేడు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికలు తెలంగాణలో అన్ని పార్టీలకి చాలా కీలకంగా మారాయి. సెలబ్రిటీలు అందరూ కూడా తమ ఓటు హక్కుని వినియోగించుకోనున్నారు. ఈ రోజు మొత్తం తెలంగాణ వ్యాప్తంగా ఓట్ల సందడి నెలకొంటుంది. ఇక సెలబ్రిటీల ఓట్లు వేస్తూ మీడియా ద్వారా ప్రజలకి కూడా ఓట్లు వేయమని పిలుపునిస్తారు. ఇక ప్రస్తుతం మన సెలబ్రిటీలు ఎవరు ఎక్కడ తమ ఓటు వినియోగించుకునున్నారు అనేది చూసుకుంటే జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ పోలింగ్ బూత్ 165లో మహేశ్‌బాబు, నమ్రత, మంచు మోహన్‌బాబు, విష్ణు, లక్ష్మి, మనోజ్ ఉన్నారు. పోలింగ్ బూత్



164లో విజయ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, శ్రీకాంత్ ఓటు వేశారు.

అలాగే ఎఫ్ఎన్‌సీసీ పోలింగ్ బూత్ 164లో రాఘవేంద్రరావు, జీవిత, రాజశేఖర్ లు, పోలింగ్ బూత్ 160 లో విశ్వక్‌సేన్, పోలింగ్ బూత్ 166; దగ్గుబాటి రాణా, సురేశ్ బాబు ఓటు హక్కు వినియోగించుకున్నారు. జూబ్లీహిల్స్ క్లబ్ పోలింగ్ బూత్ 149లో చిరంజీవి, సురేఖ, రాంచరణ్, ఉపాసన , నితిన్, ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ పోలింగ్ బూత్ 157 రవితేజ ఓటు వేశారు. ఓబుల్‌రెడ్డి స్కూల్ పోలింగ్ బూత్ 150లో జూనియర్ ఎన్టీఆర్, ప్రణతి, బీఎస్ఎన్ఎల్ సెంటర్ పోలింగ్ బూత్ 153 లో అల్లు అర్జున్, స్నేహారెడ్డి ,అల్లు అరవింద్, అల్లు శిరీష్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ పోలింగ్ బూత్ 151లో నాగార్జున, అమల, నాగచైతన్య, అఖిల్ మణికొండ హైస్కూల్ లో ప్రభాస్, అనుష్క, వెంకటేశ్, బ్రహ్మానందం, షేక్ పేట్ ఇంటర్నేషనల్ స్కూల్ రాజమౌళి రామా రాజమౌళి, రోడ్ నెం.45, జూబ్లీహిల్స్ ఆర్థిక సహకార సంస్థ కేంద్రంలో అల్లరి నరేశ్, యూసఫ్‌గూడ చెక్‌పోస్టు ప్రభుత్వ పాఠశాల: తనికెళ్ల భరణి లైన్ లో నిలబడి ఓటు వేశారు. వీరితో పాటు సెలబ్రిటీలు అందరూ కూడా వారి పరిధిలో ఉన్న కేంద్రాలలో ఓటు వేయడంతో మీడియా వారిపై ఫోకస్ చేసింది. ప్రజలకకి ఓటుపై అవగాహన కల్పించడానికి సెలబ్రిటీల ద్వారా బైట్స్ కూడా మీడియా వాళ్ళు తీసుకుంటూ ఉండటం విశేషం. గతంలో పోల్చుకుంటే ఈ సారి ఓటింగ్ శాతం తెలంగాణలో పెరిగే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది.

# పింక్ బ్యూటీలో ఊర్వశి పేంపర్ చేస్తోందే

నులుగురి కి భిన్నంగా ట్రై చేసి సంథింగ్ స్పెషల్ గా నిలుస్తుంది. ఆన్ స్క్రీన్ పైనే కాదు ఆఫ్ ది స్క్రీన్ లోనూ ఊర్వశి రౌతేలా రచ్చ ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. అమ్మడి ఎలివేషన్లకి ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. ప్లేస్ ఎలాంటిదైనా అక్కడ ఊర్వశి మార్క్ పడాల్సిందే. అందుకు ప్రత్యేకమైన ప్రణాళికను అనుసరిస్తుంది. నులుగురి కి భిన్నంగా ట్రై చేసి సంథింగ్ స్పెషల్ గా నిలుస్తుంది. ఎలాంటి దుస్తుల్లోనైనా అందాల వడ్డన తప్పనిసరిగా భావిస్తుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఊర్శశి రౌతేలా మరో కొత్త ఫోటోతో నెటి జనుల ముందు కొచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా అందాల ఆరబోతతో ఆకట్టుకుంటుంది. పింక్ వర్ణం దుస్తుల్లో మెరిసిపోతుంది. గులాబీ రంగు అమ్మడిని ప్రత్యేకంగా హైలైట్ చేస్తుంది. కళ్లకి గ్లాసెస్ ధరించి..బీచ్ హెటల్స్ లో ఇలా కెమారికి ఫోజులి చ్చింది. చేతిలో చిలకాకు పచ్చ హ్యాండ్ బ్యాగ్ ముందు భాగంలో వేలాడదీసి దాచాల్సిన వాటిని దాచేసింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ అవుతుంది. ఈ ఫోటో పై అభిమానుల కామెంట్లు అంతే ఆసక్తికరం. ఎవరికి వారు తమదైన శైలిలో ఊర్వశి అందాన్ని పొగిడేస్తున్నారు. ఇక ప్రచార పరంగా ఊర్వశి అనుసరించే సోషల్ మీడియా స్ట్రాటజీ గురించి తెలిసిందే. వ్యక్తిగతంగా ప్రమోట్ అవ్వడానికి ఏదో విషయంలో తలదూ ర్చుతుంది. అలా కుదరకపోతే తానే ఓ వివాదాన్ని క్రియేట్ చేస్తుంది. తర్వాత నెట్టింట హాట్ టాపిక్ గా మారుతుంది. ఈ విషయంలో అమ్మడు పీహెచ్ డీనే చేసేసింది. అలాగే కెరీర్ పరంగా దూకుడు చూపిస్తోంది. వాల్తేరు వీరయ్య తర్వాత వరుసగా రెండు..మూడు సినిమాల్లో ఐటం పాటల్లో ఛాన్స్ అందుకుంది. కానీ వాటి ఫలితాలు మాత్రం ఆశించిన విధంగా రాలేదు. అయినా అవేవి సొగసరి కెరీర్ డ్రా బ్యాక్ లా కనిపించలేదు. కొత్త అవకాశాలు బాగానే చేజిక్కించు కుంటుంది.



# ఆండ్రియా చాలా కాలానికి ఇలా

గాయని కం నటి ఆండ్రియా పరిచయం అవసరం లేదు. పాపులర్ యువసంగీత దర్శకుడితో ప్రేమాయణం సాగించి చివరికి బ్రేకప్ తో డిప్రెషన్ ని ఫేస్ చేసిందని తమిళ మీడియాల్లో కథనాలొచ్చాయి. గాయని కం నటి ఆండ్రియా పరిచయం అవసరం లేదు. పాపులర్ యువసంగీత దర్శకుడితో ప్రేమాయణం సాగించి చివరికి బ్రేకప్ తో డిప్రెషన్ ని ఫేస్ చేసిందని తమిళ మీడియాల్లో కథనాలొచ్చాయి. చాలా కాలం క్రితం తన ఒత్తిళ్ల జీవితం గురించి అనారోగ్యం గురించి కలత చెందానని ఆండ్రియా వెల్లడించింది. ఆ తర్వాత అన్నిటి నుంచి బయటపడి అన్నివిధాలా కెరీర్ పైనే ఆండ్రియా దృష్టి సారించింది. ఆండ్రియా హీరోయిన్ గానే కాదు.. తనదైన హస్కీ వాయిస్ తో తెలుగు -తమిళ పరిశ్రమలో గాయనిగా పేరు తెచ్చుకుంది. నాగచైతన్య దడ సహా పలు తెలుగు చిత్రాల్లో తనదైన గానంతో అలరించింది. యుగానికి ఒక్కడు చిత్రంతో కథానాయికగా స్పైసీ లుక్ తో అలరించింది. ఆండ్రియా నటించిన వరుస చిత్రాలు తెలుగులో విడుదలయ్యాయి. కొన్ని డబ్బింగులు ఆకట్టుకున్నాయి. కానీ ఎందుకనో సౌత్ లో స్టార్ హీరోయిన్ గా ఆశించిన స్థాయికి ఎదగలేక రేసులో వెనకబడింది.

మరోవైపు ఆండ్రియా సోషల్ మీడియాల్లోను యాక్టివ్ గా ఉంది. తాజాగా ఆండ్రియా డెనిమ్ షార్ట్ లో ఉన్న అందమైన ఫోటోని ఇన్ స్టాలో షేర్ చేసింది. ఈ ఫోటోగ్రాఫ్ లో ఆండ్రియా ఎంతో సింపుల్ గా కనిపిస్తోంది. డెనిమ్ షార్ట్ కి తగ్గట్టుగా టాప్ లో బనియన్ ని ఎంపిక చేసుకుంది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. ఆండ్రియా ఇటీవల పూర్తిగా కెరీర్ పైనే శ్రద్ధ పెట్టింది. ఇంతకుముందు మాస్టర్ చిత్రంలో ఆండ్రియా కీలక పాత్రలో కనిపించింది. ఇటీవల నాలుగైదు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. ఇవన్నీ సెట్స్ లో ఉన్నాయి. కమలా కన్నన్ దర్శకత్వంలో వట్టామ్.. మిస్కిన్ దర్శకత్వంలో పిసాసు-2 లో నటించింది. కా - మాలిగై- నో ఎంట్రీ సహా మరో రెండు చిత్రాల్లోను ఆండ్రియా నటించింది. బాబి ఆంటోని, దినేష్ సెల్వరాజ్ తెరకెక్కిస్తున్న సినిమాల్లో ను నటిస్తోంది.



# రష్మిక ఆ భామనే ఫాలో అవుతోందా



తమిళ్ మినహా ఏ భాషలోనూ సినిమాలు చేయకుం డా కేవలం అక్కడే రెండు రకాల సినిమాలు చేస్తోంది. నేషనల్ క్రష్ బ్యూటీ రష్మిక మందన్నా .. లేడీ సూపర్ స్టార్ స్ట్రాటజీని ఫాలో అవుతుందా? ప్లానింగ్ అంతా ఆమె దగ్గర నుంచే కాపీ కొడుతుందా? అంటే అవుననే తెలుస్తోంది. లేడీ సూపర్ స్టార్ నయనతార కెరీర్ బ్యాలెన్స్ ముందుకు తీసుకెళ్తోన్న సంగతి తెలిసిందే. తమిళ్ మినహా ఏ భాషలోనూ సినిమాలు చేయకుం డా కేవలం అక్కడే రెండు రకాల సినిమాలు చేస్తోంది. ఓవైపు హీరోలతో కమర్షియల్ చిత్రాలు చేస్తూనే మరోవైపు లేడీ ఓరియేంటెడ్ చిత్రాల్లోనూ నటిస్తోంది.

నాలుగేళ్లగా అమ్మడు ఇదే స్ట్రాటజీని అనుసరిస్తుంది. ఈ మధ్యనే జవాన్ తో బాలీవుడ్ లోనూ అడుగు పెట్టింది. అక్కడ కొత్త అవకాశాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్ట్రాటజీ మారుస్తుందా? కొత్త ప్లానింగ్ ఏదైనా చేస్తుందా? అన్నది చూడాలి. అయితే ఈ విషయంలో నయనతార స్ట్రాటజీని తెలివిగా ఫాలో అవుతుంది రష్మిక మందన్న. అమ్మడు బాలీవుడ్ కి వెళ్లినంత మాత్రాన టాలీవుడ్ ని అశ్రద్ధ చేయలేదు. రెండు భాషల్ని బ్యాలెన్స్ చేస్తూ సినిమాలు చేస్తోంది. ఇంకా చెప్పాలంటే? నయన్ కంటే ఇంకాస్త యాక్టివ్ గా పనిచేస్తుంది అనొచ్చు. కమర్షియల్ సినిమాలతో పాటు...లేడీ ఓరియేంటెడ్ చిత్రాలు ఈ మధ్యనే బాగానే పట్టాలెక్కిస్తుంది. అలాగే కీలకమైన పాత్రల్లో నటించే ఛాన్స్ వస్తే ఆ రకంగానూ మిస్ చేసుకోవడం లేదు. చిన్న పాత్ర అయినా బలంగా ఉంది అంటే నో అనకుండా చేస్తుంది. సీతారామం లో హీరోయిన్ కాకపోయినా ఆఫ్రీన్ రోల్ తో ఎంతగా కనెక్ట్ అయిందో తెలిసిందే. ఒకేసారి ఇన్ని రకాల పాత్రలు పోషించడం అంటే చిన్న విషయం కాదు. ఎంతో కమిట్ మెంట్..డెడికేషన్ ఉండాలి. ఇవన్నీ రష్మికలో దండీగా ఉన్నాయి. ఫీమేల్ సెంట్రిక్ చిత్రాలు ఇప్పుడిప్పుడే మొదలు పెడుతుంది. వాటి ఫలితాలు ఎలా ఉంటాయి? అన్నది చూడాలి. చురుకైన నటి. యువతని ఆకర్షించే లక్షణాలు ఎన్నో ఉన్నాయి. ఆ క్రేజ్ ని తెలివిగా ఎన్ క్యాష్ చేసుకునే స్ట్రాటజీ రష్మిక దగ్గర ఉంది.

PRINTER, PUBLISHER, EDITOR AND OWNER, BINGI SATHAIAH YAADHARTHAVAADHI TELUGU DAILY, Printed at MEGHA Printers, H.No.11-52, Indira Nagar, Siddipet - 502 103. E-mail: yadaardhavadhieditor@gmail.com
TEL TEL / 2023/ 85376 # 11-52, INDRA NAGAR, PRASHANTH NAGAR, SIDDIPET - 502 103. PUBLISHED FROM: HO # 1-3-183/40/46/29, GANDHI NAGAR, HYDERABAD - 500 080.